thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 82 | జగిత్యాల | గురువారం | 18 జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## భారత్ ఏకు 319 పరుగుల భారీ స్కోర్లు



11

## అమెరికా అధ్యక్ష భవనంపై భారీ ఉగ్రదాడికి కుట్ర



అమెరికా అధ్యక్ష భవనంపై భారీ ఉగ్రదాడి చేసేందుకు పన్నిన కుట్రను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ భగ్నం చేసింది.

4

## ఉగ్ర ముఠా గుట్టురట్టు

- ఏడుగురు అరెస్ట్..
- పుల్వామా తరహా కుట్ర కోణంలో దర్యాప్తు



4

## 30లోగా కేవైసీ, బయోమెట్రిక్ చేసుకోవాలి

- పూర్తి చేయకుంటే గ్యాస్ సబ్సిడీ కట్!
- గ్యాస్ వినియోగదారులకు కేంద్రం మెలిక



4



# మెట్రో వార్!

### కాంగ్రెస్, బీజేపీ మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం

- కిషన్ రెడ్డే అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రి ఆరోపణ
- సాంకేతిక పరిశీలన జరగాలన్న కేంద్రమంత్రి
- కాంగ్రెస్ సర్కారు వైఫల్యమేనని కేటీఆర్ విమర్శ

హైదరాబాద్ మహానగర తలమానికం మెట్రో రెండో దశ ప్రాజెక్టు ఇప్పుడు అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ చదరంగానికి వేదికగా మారింది. ప్రాజెక్టును కేంద్రమే ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటూ 13,600 కోట్ల రుణ బదిలీని నిలిపివేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేస్తుండగా.. అదంతా పచ్చి అబద్ధమని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే తమపై బురద జల్లుతున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎదురుదాడికి దిగారు. వీరికి తోడు కాంగ్రెస్ సర్కారు చేతగానితనం వల్లే మెట్రో ఆగిపోయిందని బీఆర్ఎస్ నేత కేటీఆర్ సైతం రంగంలోకి దిగడంతో రాజకీయం మరింత వేడెక్కింది. ప్రాజెక్టు క్రెడిట్ కోసం కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య సాగుతున్న ఈ ఆధిపత్య పోరులో.. అంతిమంగా ట్రాఫిక్ కష్టాలతో నగర ప్రజలే తీవ్రంగా నష్టపోతున్నారన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

*- తెలంగాణ బ్యూరో,*

వివరాలు 2లో..



# ఎల్ఐసీకి ఏజెంట్లే మూలస్తంభం!

### నాగోల్ లో లియాఫీ 18వ కౌన్సిల్ భేటీ

- ఏజెంట్ల హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యం
- దేశవ్యాప్తంగా 3,000 మంది ప్రతినిధుల హాజరు
- ఏజెన్సీ వ్యవస్థ బలోపేతంపై కీలక తీర్మానాలు

జీవిత బీమా సంస్థకు ఏజెంట్లే మూలస్తంభాలని, వారి హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తామని లియాఫీ స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా నాగోల్ లోని శుభం కన్వెన్షన్ సెంటర్ లో లియాఫీ 18వ జనరల్ కౌన్సిల్ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేశవ్యాప్తంగా 3,000 మందికి పైగా ఏజెంట్లు, ప్రతినిధులు హాజరైన ఈ భేటీలో.. ఏజెన్సీ వ్యవస్థ బలోపేతం, ఏజెంట్ల సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించి కీలక తీర్మానాలు ఆమోదించారు.



# బతుకు మార్చే బడి!

- ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్
- 27 లక్షల విద్యార్థులకు అంకితం
- అల్పాహార పథకం ప్రారంభం
- ఫుట్ బాల్ ఆడిన ముఖ్యమంత్రి

అంతర్జాతీయ ప్రమాణాలతో ఆరుట్లలో నిర్మించిన తొలి తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దీన్ని అంకితం చేసిన ఆయన.. ఇదే వేదిక నుంచి బడుల్లో ప్రతిష్టాత్మక అల్పాహార పథకానికి శ్రీకారం చుట్టారు.

వివరాలు 2లో..

# సంక్షోభమే!

- కాంగ్రెస్ ది రాక్షస పాలన
- దండుపాళ్యం బ్యాచ్ లా మంత్రులు
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2



2

# రైతుకే పెద్దపీట!

### పేదలకు సన్నబియ్యం.. లాభదాయక వ్యవసాయమే లక్ష్యం

### బాయిల్డ్ రైస్ కొనని ఎఫ్ సీఐ: సబ్ కమిటీలో డిప్యూటీ సీఎం భట్టి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పేదలు సన్నబియ్యం తినాలి, రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే తమ విధానమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. లాభదాయక వ్యవసాయం వైపు తెలంగాణ రైతాంగం అడుగులు వేసేలా, మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను పండించేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

2

## రోడ్డుకు ట్రంప్ పేరా?

నియంతను గౌరవిస్తారా?.. బీజేపీ బాటలోనే కాంగ్రెస్ సర్కారు

సీఎం నిర్ణయంపై ఎంపీ బేబీ ఫైర్

## హైదరాబాద్‌కు టెస్లా!

మాదాపూర్ లో ఎక్స్‌పీరియన్స్ సెంటర్

బొల్లారంలో డెలివరీ, సేవల కేంద్రం

2



## సాంకేతికతతో సాగుకు కొత్త దిశ!

- యూరియా యాప్ పనితీరుపై దీర్ఘ హర్షం
- ఖరీఫ్ సన్నద్ధతపై మంత్రి తుమ్మల వరుస సమీక్షలు

3

# గుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం!

- ఇందిరమ్మ ఇళ్లలో వారికే తొలి ప్రాధాన్యం
- పైకప్పు మార్పునకు 2 లక్షల సాయం
- అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష



3

రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చూడటమే లక్ష్యంగా.. 2వ విడత ఇందిరమ్మ ఇళ్లలో గుడిసెవాసులకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. అర్హుల గుర్తింపునకు వెంటనే సర్వే చేయాలని, రేకుల ఇళ్ల పైకప్పు మార్పునకు 2 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

చురకలు

గురువారం 18 జూన్ 2026

# బతుకు మార్చే బడి!

**ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్.. 27 లక్షల విద్యార్థులకు అంకితం**

**అల్పాహార పథకం ప్రారంభం.. ఫుట్ బాల్ ఆడిన ముఖ్యమంత్రి**



**హైదరాబాద్, జూన్ 17:** రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో 15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఈ బడిని అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ బడుల్లో చదవడం ఏమాత్రం నామోషీ కాదన్న ఆయన.. ఇదే వేదికగా పాఠశాలల్లో అల్పాహార పథకానికి శ్రీకారం చుట్టారు. హెలీప్యాడ్ నుంచి ప్రత్యేక బస్సులో పాఠశాలకు చేరుకున్న ముఖ్యమంత్రికి విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఆవరణలో మొక్క నాటిన అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన అల్పాహారం చేశారు. తరగతి గదులు, డిజిటల్ బోర్డులు, లైబ్రరీ, సైన్స్ ప్రయోగశాలలు, సంగీతం, నృత్యం బోధించే విభాగాలను పరిశీలించారు. వంటశాలలో కార్మికులతో ముచ్చటించిన ముఖ్యమంత్రి స్వయంగా పూరీలు తయారు చేసి అందరినీ ఉత్సాహపరిచారు.

### ఆంగ్ల మాధ్యమంలో బోధన..

ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇక్కడ ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన అందించనున్నారు. ప్రాంగణంలో వాలీబాల్, క్రికెట్, ఫుట్ బాల్, కబడ్డీ, టెన్నిస్ కోర్టులు ఏర్పాటు చేశారు. క్రీడా ప్రాంగణాలను పరిశీలించిన ముఖ్యమంత్రి కాసేపు విద్యార్థులతో కలిసి ఫుట్ బాల్ ఆడారు. విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పాఠశాల వసతులను ముఖ్యమంత్రికి వివరించారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, సలహాదారు కేశవరావు, విప్ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# హైదరాబాద్ కు టెస్లా!

**మాదాపూర్ లో ఎక్స్‌పీరియన్స్ సెంటర్**

**బొల్లారంలో డెలివరీ, సేవల కేంద్రం**

**హైదరాబాద్, జూన్ 17:** ప్రముఖ విద్యుత్ కార్ల తయారీ సంస్థ టెస్లా హైదరాబాద్ లో తన తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కు శ్రీకారం చుట్టింది. మాదాపూర్ హైటెక్ సిటీలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా.. బొల్లారం పారిశ్రామిక వాడలో కార్ల డెలివరీ, విక్రయానంతర సేవల కేంద్రాన్ని నెలకొల్పింది. దేశంలో టెస్లాకు ఇది 5వ కేంద్రం కావడం విశేషం. ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ లో కస్టమర్లు టెస్లా 2026 మోడల్ వై ప్రీమియం రేర్ వీల్ డ్రైవ్ తో పాటు మోడల్ వై ఎల్ వాహనాలను పరిశీలించవచ్చని సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. టెస్లా కార్లలో వాడుతున్న అత్యాధునిక సాంకేతికత, భద్రతా ప్రమాణాలు, వాహన పనితీరును ఇక్కడ ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పించారు. ఇప్పటికే బెంగళూరు, ముంబై, ఢిల్లీ, గురుగ్రామ్ నగరాల్లో టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను నెలకొల్పగా.. తాజాగా హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన కేంద్రంతో దేశంలో వీటి సంఖ్య 5కు చేరింది.

# రైతుకే పెద్దపీట!

**పేదలకు సన్నబియ్యం.. లాభదాయక వ్యవసాయమే లక్ష్యం**

**బాయిల్డ్ రైస్ కొనని ఎఫ్ సీఐ: సబ్ కమిటీలో డిప్యూటీ సీఎం భట్టి**




**హైదరాబాద్, జూన్ 17:** రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పేదలు సన్నబియ్యం తినాలి, రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే తమ విధానమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. లాభదాయక వ్యవసాయం వైపు తెలంగాణ రైతాంగం అడుగులు వేసేలా, మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను పండించేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. సచివాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు, నిల్వ సదుపాయాలపై మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. నాణ్యమైన వరి సాగుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించారు. తెలంగాణ సోనా, బీపీటీ 5204, జై శ్రీరామ్, హెచ్ఎంటీ తదితర సన్న రకాలకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున రైతులు వీటిని సాగు చేసేలా చూడాలని రైతు కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ రకాలపై గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించింది. రాబోయే సీజన్ లో వీటిని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తే అటు రైతులకు అదనపు ఆదాయం, ఇటు మార్కెట్ రంగానికి ప్రయోజనం చేకూరుతుందని సబ్ కమిటీకి నివేదించింది.

### కేంద్రం తీరుపై ఆందోళన..

ఎఫ్ సీఐ ధాన్యం కొనుగోళ్లు తగ్గిస్తూ రాష్ట్రానికి ఇబ్బందులు సృష్టిస్తోందని వ్యవసాయ కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. బాయిల్డ్ రైస్ ను ఏమాత్రం కొనుగోలు చేయడం లేదని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలతో తెలంగాణ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని భట్టి విక్రమార్క విమర్శించారు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జాతీయ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో వార్!

- కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం
- కిషన్ రెడ్డే అడ్డుకుంటున్నారని సీఎం ఆరోపణ
- సాంకేతిక పరిశీలన జరగాలన్న కేంద్రమంత్రి
- కాంగ్రెస్ సర్కారు వైఫల్యమేనని కేటీఆర్ విమర్శ



**హైదరాబాద్, జూన్ 17:** తెలంగాణ రాజకీయాల్లో హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టు పెద్ద రాజకీయ యుద్ధానికి కేంద్రబిందువుగా మారింది. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మరోవైపు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య తీవ్రమైన మాటల యుద్ధం సాగుతోంది. మెట్రో నీవల్లే ఆగింది అని ముఖ్యమంత్రి ఆరోపిస్తుంటే.. అది అబద్ధం అని కేంద్రమంత్రి కౌంటర్ ఇస్తున్నారు. ఈ వివాదంలో బీఆర్ఎస్ కూడా ఎంటర్ కావడంతో రాజకీయ వేడి మరింత పెరిగింది. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. విమానాశ్రయం, పాతబస్తీ, కొత్త కారిడార్లతో సుమారు 122 కిలోమీటర్ల మేర విస్తరణను లక్ష్యంగా పెట్టుకుంది. అయితే మొదటి దశ మెట్రోను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడం, దానికి సంబంధించిన రుణాల బదిలీ, కేంద్ర అనుమతులు వంటి అంశాలు ఇంకా పూర్తి కాలేదు. ఇదే ఇప్పుడు ప్రధాన రాజకీయ వివాదానికి కారణమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావాలనే మెట్రో ప్రాజెక్టుకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మోకాలడ్డుతున్నారని ఆరోపిస్తున్నారు. మెట్రోను ప్రభుత్వ పరం చేసుకునేందుకు అవసరమైన సుమారు 13600 కోట్ల రుణ బదిలీని కేంద్రం ఉద్దేశపూర్వకంగా నిలిపివేసిందని విమర్శిస్తున్నారు. తెలంగాణ అభివృద్ధి చెందితే బీజేపీకి రాజకీయంగా నష్టం జరుగుతుందనే భావనతోనే కిషన్ రెడ్డి మెట్రో విస్తరణను ఆలస్యం చేస్తున్నారని మండిపడుతున్నారు. కేంద్రం అనుమతిస్తే రాష్ట్ర ప్రభుత్వమే సొంత ఖర్చుతో మెట్రో నిర్మిస్తుందని కూడా ముఖ్యమంత్రి ప్రకటించారు.

### అవాస్తవాలు మాట్లాడుతున్నారు..

ముఖ్యమంత్రి కావాలనే తమపై నిందలు మోపుతున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎదురుదాడికి దిగారు. కేంద్ర ప్రభుత్వం మెట్రో రెండో దశకు వ్యతిరేకం కాదని చెబుతున్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఇప్పటికే సూత్రప్రాయంగా ఈ ప్రాజెక్టుకు అంగీకరించిందని ఆయన గుర్తుచేస్తున్నారు. ఇంత పెద్ద ప్రాజెక్టుకు సాంకేతిక, ఆర్థిక పరిశీలనలు కచ్చితంగా పూర్తవ్వాల్సి ఉందని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీల అమలులో ఎదుర్కొంటున్న విమర్శల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే మెట్రో అంశాన్ని రాజకీయంగా వాడుకుంటోందని కిషన్ రెడ్డి ఆరోపిస్తున్నారు.

### కాంగ్రెస్ వైఫల్యమే..

కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల తూటాలు పేలుతున్న తరుణంలో బీఆర్ఎస్ నేత కేటీఆర్ రంగంలోకి దిగారు. మెట్రో ఆలస్యానికి కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా వైఫల్యమే ప్రధాన కారణమని ఆయన విమర్శిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలను మార్చడం వల్లే ఈ గందరగోళం ఏర్పడిందని అంటున్నారు. కేంద్రంతో సమన్వయం చేసుకుని నిధులు తీసుకురావడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని కేటీఆర్ ఆరోపిస్తున్నారు.

### అసలు రాజకీయ లెక్కలు ఏమిటి?

ఈ వివాదం వెనుక ప్రధానంగా మూడు రాజకీయ కోణాలు కనిపిస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మూడు పార్టీలు బలంగా ఉన్నాయి. మెట్రో వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టు విజయవంతమైతే దాని క్రెడిట్ ఎవరికి దక్కుతుందన్నదే ప్రధాన పోటీగా మారింది. 2029 ఎన్నికల వ్యూహంలో భాగంగా హైదరాబాద్ అభివృద్ధిని ప్రధాన అజెండాగా చూపించాలని కాంగ్రెస్ చూస్తుంటే, కేంద్ర నిధుల క్రెడిట్ తమకే దక్కాలని బీజేపీ కోరుకుంటోంది. ఇదే సమయంలో ఈ వివాదాన్ని ఉపయోగించుకుని కాంగ్రెస్ అసమర్థతను ప్రజల్లో ఎండగట్టాలని బీఆర్ఎస్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

### నష్టపోతున్నది ఎవరు?

ఈ రాజకీయ యుద్ధంలో అంతిమంగా నష్టపోతున్నది హైదరాబాద్ ప్రజలే. పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలు, విమానాశ్రయ మెట్రో ఆలస్యం, పాతబస్తీ కనెక్టివిటీ నిలిచిపోవడం నేరుగా నగరవాసులపై పడుతోంది. రియల్ ఎస్టేట్, పెట్టుబడులపై కూడా దీని ప్రభావం తీవ్రంగా పడుతోంది. కేంద్రం, రాష్ట్రం సమన్వయంతో ముందుకు వెళ్తేనే ప్రాజెక్టు వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంది. లేదంటే మెట్రో రెండో దశ రాజకీయ ఆరోపణల మధ్యే చిక్కుకుపోయే ప్రమాదం ఉంది. ఈ వివాదం కేవలం రవాణా ప్రాజెక్టు సమస్య మాత్రమే కాకుండా తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ ఆధిపత్య పోరాటానికి ప్రతీకగా మారింది. కేంద్రం అడ్డుకుంటోందని కాంగ్రెస్, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే అని బీజేపీ ఆరోపించుకుంటున్నాయి. మధ్యలో బీఆర్ఎస్ కూడా తన లాభనష్టాలను బేరీజు వేసుకుంటోంది. చివరకు మెట్రో ప్రాజెక్టు ముందుకు సాగుతుందా లేక రాజకీయ యుద్ధంలోనే ఇరుక్కుపోతుందా అనేదే ఇప్పుడు హైదరాబాద్ ప్రజల ముందున్న ప్రధాన ప్రశ్న.

# రాష్ట్రమంతా సంక్షోభమే!

- కాంగ్రెస్ ది రాక్షస పాలన
- మంత్రులు దండుపాళ్యం బ్యాచ్ లా తయారయ్యారు
- మళ్లీ బీఆర్ఎస్ దే అధికారం
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**ఖమ్మం,జూన్ 17:** రాష్ట్రంలో ఎక్కడ చూసినా కూల్చివేతలే కనిపిస్తున్నాయని, సంక్షేమం లేదని అంతా సంక్షోభమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు దండుపాళ్యం బ్యాచ్ లా రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రులు సైతం తీసిపోవడం లేదని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా మళ్లీ బీఆర్ఎస్ దే అధికారమని, కేసీఆర్ తిరిగి సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన బూత్ లెవల్ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి రాక్షస పాలన సాగిస్తున్నారని, దండుపాళ్యం ముఠాకు ఆయన అధ్యక్షుడైతే.. మంత్రులు ఆయన్ను మించిపోయారని కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రెవెన్యూ మంత్రి అవినీతికి హద్దులు లేకుండా పోయిందని, ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు దాచుకోవడం, దోచుకోవడం తప్ప జిల్లాకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఒక మంత్రి భూ కబ్జాలకు పాల్పడుతుంటే, మరో మంత్రి వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారని, ఆర్థిక మంత్రి రాష్ట్ర పరిస్థితిని అస్తవ్యస్తం చేశారని ఆరోపించారు. కేసీఆర్ ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించారని, ఆయన మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు.

### నిజాయతీగా ఎన్నికలు జరిగితే..

నిజాయతీగా ఎన్నికలు జరిగితే కేసీఆర్ కచ్చితంగా వంద సీట్లతో గెలుస్తారని, అలా జరగాలంటే కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 25 వరకు ఓటర్ల సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమం జరుగుతుందని, ఇందులో కచ్చితంగా పాల్గొని పార్టీకి నష్టం జరగకుండా చూడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండన్నర ఏళ్లలో లక్షల కోట్లు అప్పు చేసి ఏమాత్రం అభివృద్ధి చేయలేదని, కానీ కేసీఆర్ తెచ్చిన అప్పులతో కాళేశ్వరం, భక్తరామదాసు లాంటి ప్రాజెక్టులతో పాటు మెడికల్, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# అభిమాని వద్దకు పవన్!

- ప్రాణాంతక వ్యాధితో పోరాడుతున్న నిరంజన్
- ఇంటికెళ్లి పరామర్శించిన ఏపీ డిప్యూటీ సీఎం
- వైద్యం కోసం 1,00,000 ఆర్థిక సాయం
- భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న వైనం



**వరంగల్,జూన్ 17:** ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న తన వీరాభిమాని నిరంజన్ ను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరామర్శించారు. వరంగల్ జిల్లా హనుమకొండలోని ఆ బాలుడి ఇంటికి స్వయంగా వెళ్లి మనోధైర్యం కల్పించారు. వైద్య ఖర్చుల నిమిత్తం 1,00,000 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. జన్యుపరమైన వ్యాధితో పోరాడుతున్న 17 ఏళ్ల నిరంజన్ కు పవన్ కల్యాణ్ అంటే చిన్నప్పటి నుంచి అమితమైన ఇష్టం. తన ఆరాధ్య నాయకుడిని చూడాలన్న బాలుడి కోరిక తెలుసుకున్న పవన్ బుధవారం నేరుగా వారింటికి వెళ్లారు. నిరంజన్ ను హత్తుకుని ముద్దాడారు. బాలుడు ఆరోగ్యంగా ఉన్నప్పుడు తన పాటలకు వేసిన డ్యాన్స్ వీడియోలను చూసి చలించిపోయారు. తిరుమల నుంచి తెప్పించిన ప్రసాదంతో పాటు భద్రకాళి అమ్మవారి వెండి ప్రతిమను నిరంజన్ తల్లిదండ్రులకు అందించారు.

### కుక్కపిల్ల కొనిస్తానని హామీ..

తనకు ఓ కుక్కపిల్లను పెంచుకోవాలని ఉందని నిరంజన్ చెప్పగా.. కొని పంపుతానని పవన్ హామీ ఇచ్చారు. ఇంటి యజమానిని స్వయంగా పిలిపించి పెంపుడు జంతువుకు అనుమతి ఇవ్వాలని కోరారు. బాలుడి తల్లిదండ్రుల ఉపాధి కోసం వారికి ఓ క్యాంటీన్ ఏర్పాటు చేయించాలని స్థానిక జనసేన నేతలను ఆదేశించారు.

### సహకరించిన వారికి కృతజ్ఞతలు..

తన పరామర్శకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పోలీసు శాఖకు పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. నిరంజన్ ధైర్యం అతడి కష్టాల కంటే గొప్పదని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజల ప్రేమను జీవితాంతం గుర్తుపెట్టుకుంటానని పేర్కొన్నారు. అనంతరం వరంగల్ భద్రకాళి అమ్మవారిని పవన్ దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు శంకర్ గౌడ్, శ్రీరామ్ తాళ్లూరి, రాధారం రాజలింగం, ఆర్ కే సాగర్ పాల్గొన్నారు.

# గుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం

- ఇందిరమ్మ ఇళ్లలో వారికే తొలి ప్రాధాన్యం
- పైకప్పు మార్పునకు 2 లక్షల సాయం
- యుద్ధప్రాతిపదికన క్షేత్రస్థాయి సర్వే
- అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష



**హైదరాబాద్,జూన్ 17:** రాష్ట్రంలో ఒక్క నిరుపేద కూడా గుడిసెలో ఉండకుండా, సొంతింటి కలను సాకారం చేస్తూ గుడిసెలు లేని తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో గుడిసెల్లో నివసించే వారికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. బుధవారం హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో ఆయన పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాల్లో ఉన్న గుడిసెలను గుర్తించేందుకు యుద్ధప్రాతిపదికన సమగ్ర సర్వే చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రజాపాలనలో 75,000 మంది గుడిసె వాసులు దరఖాస్తు చేసుకున్నారని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిజమైన అర్హులను తేల్చాలన్నారు. దరఖాస్తు చేసుకోని వారు ఇప్పుడు కూడా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

## రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు..

రెండో విడత కింద రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి సర్కారు నిర్ణయం తీసుకుంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 2,000 ఇళ్ల చొప్పున పారదర్శకంగా మంజూరు చేయనున్నారు. లబ్ధిదారుడే తన ఇంటిని నిర్మించుకునే బీఎల్సీ విధానంలో అవకాశం కల్పించడంతో పాటు, పట్టణాల్లో స్థలాల కొరత ఉంటే గ్రౌండ్ ప్లస్ 1 నిర్మాణాలకు కూడా అనుమతి ఇస్తామని మంత్రి వెల్లడించారు.

## పైకప్పు మార్పునకు 2 లక్షలు..

గుడిసెలు, రేకులు, నాపరాళ్లు, టార్పాలిన్ షీట్ల కింద నివసిస్తున్న పేదల భద్రత కోసం రూఫ్ రీప్లేస్ మెంట్ పథకం కింద స్లాబ్ వేసుకునేందుకు 2 లక్షల వరకు ఆర్థిక సాయం అందించనున్నారు. నియోజకవర్గానికి 500 చొప్పున మొత్తం 50,000 ఇళ్లను దీనికింద ఎంపిక చేస్తారు. గతంలో ఇందిరమ్మ, గృహలక్ష్మి పథకాల్లో మంజూరై బేస్ మెంట్ లేదా పైకప్పు స్థాయిలో నిలిచిపోయిన అసంపూర్తి ఇళ్లను కూడా ఈ పథకంలో చేర్చి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని పొంగులేటి స్పష్టం చేశారు. కులం, మతం, పార్టీ తేడా లేకుండా పూర్తి పారదర్శకతతో పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# సాంకేతికతతో సాగుకు కొత్త దిశ

- 7 వరి రకాలకే ప్రాధాన్యం
- యూరియా యాప్ పనితీరుపై డీలర్ల హర్షం
- శాటిలైట్ సాయంతో చీడపీడల గుర్తింపు
- ఖరీఫ్ సన్నద్ధతపై మంత్రి తుమ్మల సమీక్షలు

**హైదరాబాద్,జూన్ 17:** ఖరీఫ్ సీజన్ సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన దిశానిర్దేశం నేపథ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సచివాలయంలో వరుస సమీక్షలు నిర్వహించారు. విత్తన కంపెనీల ప్రతినిధులు, ఎరువుల డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, కృషి వాస్ ప్రతినిధులతో విడివిడిగా సమావేశమై ఖరీఫ్ ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. మార్కెట్ డిమాండ్, మిల్లర్ల సూచనలు, ఎగుమతుల అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న 7 వరి రకాల విత్తనాల లభ్యతపై మంత్రి సమీక్షించారు. బీపీటీ-5204 (సాంబమసూరి), ఆర్ఎన్ఆర్-15048 (తెలంగాణ సొన), హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం-1638 (కూనారం సన్నలు), డబ్ల్యూజీఎల్-44 (సిద్ధి), కేఎన్ఎం-7715 రకాల విత్తనాలను రైతులకు విస్తృతంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. గతంలో దొడ్డు రకాల సాగు 60 శాతం, సన్న రకాల సాగు 40 శాతం ఉండేదని.. సన్నాలకు ప్రభుత్వం బోనస్ ప్రకటించిన తర్వాత సన్న రకాల సాగు 60 శాతానికి చేరిందని వివరించారు. రైతులు ఏ రకం విత్తనాన్ని ఎంత కొనుగోలు చేశారో ప్రభుత్వానికి నివేదించాలని, విత్తన నిల్వలను డీలర్లు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. విత్తన సబ్సిడీని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసే విధానాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు.



## యూరియా యాప్ అదుర్స్..

ఖరీఫ్ సీజన్ లో ఎరువుల సరఫరాపై ఫెర్టిలైజర్ డీలర్లతో మంత్రి చర్చించారు. ఎరువుల సరఫరాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. దేశంలోనే తొలిసారిగా సాగు విస్తీర్ణం ఆధారంగా యూరియా పంపిణీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం యాప్ రూపొందించిందని, ఈ విధానాన్ని కేంద్రంతో పాటు ఇతర రాష్ట్రాలు కూడా ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాయని తెలిపారు. సాంకేతికతను వినియోగించి సరైన రైతుకు, సరైన పరిమాణంలో యూరియా అందించడమే తమ లక్ష్యమన్నారు. యాప్ రాకతో రద్దీ సమస్య తగ్గిందని, రైతులు తమకు అనుకూలమైన సమయంలో వచ్చి ఎరువులు కొనుగోలు చేస్తున్నారని డీలర్లు మంత్రి దృష్టికి తెచ్చారు.

## శాటిలైట్ తో వ్యాధుల గుర్తింపు..

వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత వినియోగంపై కృషి వాస్ ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్షించారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా పంటల్లో చీడపీడలను అప్పటికప్పుడే గుర్తించి, అవి విస్తరించకముందే రైతులకు సమాచారం అందించేలా ఈ ప్రాజెక్టు పనిచేస్తుందని కంపెనీ ప్రతినిధులు వివరించారు. దీనిద్వారా రైతులు పొలాల్లో తిరిగి వ్యాధులను గుర్తించాల్సిన అవసరం తప్పుతుందని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలాన్ని ఈ ప్రాజెక్టు పైలట్ అమలుకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ సేవలతో లబ్ధి పొందిన అంకంపాలెం రైతు వీరభద్రరావుకు మంత్రి స్వయంగా ఫోన్ చేసి ప్రాజెక్టు ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ప్రపంచంలోని ఉత్తమ సాంకేతికతను మన రైతులకు అందుబాటులోకి తేవడమే ప్రభుత్వ ధ్యేయమని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశాల్లో విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ సంచాలకులు బి గోపి, మార్క్ ఫెడ్ ఎండీ రాహుల్ రాజ్, విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ యాస్మిన్ బాషా, వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్య పాల్గొన్నారు.

# ఎల్ఐసీకి ఏజెంట్లే మూలస్తంభం!

- నాగోల్ లో ఘనంగా లియాఫీ 18వ జనరల్ కౌన్సిల్ సమావేశాలు
- ఏజెంట్లు, పాలసీదారుల హక్కుల పరిరక్షణే ప్రధాన ధ్యేయం
- దేశవ్యాప్తంగా తరలివచ్చిన 3,000 మందికి పైగా ప్రతినిధులు
- భవిష్యత్ కార్యాచరణపై విస్తృత చర్చ, తీర్మానాల ఆమోదం



**రంగారెడ్డి, జూన్ 17:** జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)కి ఏజెంట్లే మూలస్తంభాలని, వారి హక్కుల పరిరక్షణతో పాటు బీమా రంగ సమగ్ర అభివృద్ధికి లియాఫీ కట్టుబడి ఉందని సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ-1964) 18వ జనరల్ కౌన్సిల్ సమావేశాలు ఎల్బీనగర్ నియోజకవర్గం నాగోల్ లోని శుభం కన్వెన్షన్ సెంటర్ లో ఘనంగా ప్రారంభమయ్యాయి. జూన్ 17, 18 తేదీల్లో నిర్వహించే ఈ సమావేశాలకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 3,000 మందికి పైగా జనరల్ కౌన్సిల్ సభ్యులు, జాతీయ కార్యవర్గ ప్రతినిధులు, రాష్ట్ర నాయకులు, బీమా ఏజెంట్లు తరలివచ్చారు. సమావేశాల ప్రారంభం సందర్భంగా లియాఫీ జాతీయ అధ్యక్షుడు శ్యామల చక్రవర్తి, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్ బి శ్రీనివాసచారి సంస్థ పతాకాన్ని ఆవిష్కరించారు. శ్యామల చక్రవర్తి అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశాలకు ముఖ్య అతిథులుగా రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి ముల్లూరి లక్ష్మణ్, ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోనల్ మేనేజర్ సేర్వన రమేష్, హైదరాబాద్ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె సంధ్యారాణి, సికింద్రాబాద్ సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రభాస్ కుమార్ సాహూ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



## సవాళ్లపై సుదీర్ఘ చర్చ..

జీవిత బీమా ఏజెంట్లు, పాలసీదారులకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు లియాఫీ జాతీయ అధ్యక్షుడు శ్యామల చక్రవర్తి, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్ బి శ్రీనివాసచారి తెలిపారు. బీమా రంగంలో వేగంగా వస్తున్న మార్పులు, ఏజెంట్లు ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులను సమీక్షించి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఏజెన్సీ వ్యవస్థ బలోపేతం, పాలసీదారుల ప్రయోజనాల పరిరక్షణ, ఏజెంట్ల సంక్షేమం, బీమా సేవల్లో డిజిటల్ రూపాంతరం, దేశవ్యాప్తంగా బీమా విస్తరణ పెంపు వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

## కీలక తీర్మానాలకు ఆమోదం..

ఈ సందర్భంగా సంస్థ సీనియర్ నాయకులు సభ్యత్వ విస్తరణ, ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి చేసిన వినతులపై నివేదికలను సమర్పించారు. ఫెడరేషన్ భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన పలు కీలక తీర్మానాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో లియాఫీ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం ఎస్ మూర్తి, జాతీయ కోశాధికారి బి శ్రీరామ్, రాజ్యాంగ కమిటీ ఛైర్మన్ బి ఎన్ చారి, స్వాగత కమిటీ ఛైర్మన్ సింగరాపు శ్రీనివాస్, పత్రికా ప్రచార కమిటీ ఛైర్మన్ షేక్ షాజహాన్, కో ఛైర్మన్ కె పాపయ్య నాయుడు, సురేష్ బాబు, సభ్యులు జన్నపల్లి శ్రీనివాసరెడ్డి, గడ్డం సత్యనారాయణ, భాస్కర్, శ్రీధర్, నవనీత్, కరుణ, రజిత, సునీత తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుకు ట్రంప్ పేరా?

## నియంతను గౌరవిస్తారా?.. బీజేపీ బాటలోనే కాంగ్రెస్ సర్కారు

## సీఎం నిర్ణయంపై ఎంఏ బేబీ ఫైర్



**న్యూఢిల్లీ,జూన్ 17:** హైదరాబాద్ లోని అమెరికా కాన్సులేట్ పక్కన ఉన్న రోడ్డుకు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని సీపీఎం నేత ఎంఏ బేబీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఒక నియంత పేరును ఆ రోడ్డుకు పెట్టడం సరికాదని ఆయన విమర్శించారు. ఈ నిర్ణయంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో వియత్నాంపై అమెరికా యుద్ధం చేస్తున్న సమయంలో, సామ్రాజ్యవాద వ్యతిరేక నేత హోచిమిన్ పేరును కోల్ కతాలోని అమెరికా కాన్సులేట్ వెలుపల ఉన్న రోడ్డుకు పెట్టారని ఎంఏ బేబీ గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం అమెరికా ఇరాన్ పై యుద్ధ వాతావరణాన్ని సృష్టించడం, వెనిజులాలో సైనిక జోక్యానికి పాల్పడటం, క్యూబాపై ఆంక్షలతో దారుణాలకు ఒడిగడుతూ సామ్రాజ్యవాద దురాక్రమణకు ప్రతీకగా నిలుస్తోందని ఆయన విమర్శించారు. నేటి కాలపు హిట్లర్ లా మారాలని ఆకాంక్షిస్తున్న ట్రంప్ ను గౌరవిస్తూ రోడ్డుకు ఆయన పేరు పెట్టడం ఏమాత్రం సబబు కాదన్నారు.

## బీజేపీ బాటలోనే కాంగ్రెస్..

ఇటీవల అమెరికా సైన్యం వాణిజ్య నౌకపై దాడి చేసి 3 భారతీయ నావికులను హతమార్చిందని ఎంఏ బేబీ ఆరోపించారు. ఇలాంటి దాడులను కొనసాగిస్తామని అమెరికా బెదిరిస్తున్నప్పటికీ భారత ప్రభుత్వం కనీస నిరసన వ్యక్తం చేయలేదని, ప్రధాని నరేంద్ర మోదీ సైతం స్పందించలేదన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని, ఆత్మగౌరవాన్ని వదులుకునేందుకు బీజేపీకి ఎటువంటి సంకోచం లేదని, ఇప్పుడు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. వివాదాస్పద నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా కాంగ్రెస్ అధిష్ఠానం తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ చేసే తీర్మానాలు మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాలని ఆయన సూచించారు.

# నీట్.. బస్సు ఫ్రీ!

## విద్యార్థులకు హాల్ టికెటే పాస్.. ఈనెల 21న అవకాశం

## మంత్రి పొన్నం వెల్లడి.. ఆర్టీసీ బస్సులో మంత్రుల ప్రయాణం



**కరీంనగర్, జూన్ 17:** ఈనెల 21న నిర్వహించే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. విద్యార్థులు తమ హాల్ టికెట్ చూపించి ఎక్కడికైనా ఉచితంగా వెళ్లవచ్చని స్పష్టం చేశారు. రవాణా కోసం విద్యార్థులు ఇబ్బంది పడకుండా చూసేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. బుధవారం మంత్రులు లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ మానకొండూరు మండలం తిమ్మాపూర్ నుంచి కరీంనగర్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ఏకైక ప్రభుత్వం తమదే అన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకే వారిని ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో ఉద్యోగాల సంఖ్యను పెంచామని, కార్మికులకు అన్ని వసతులు కల్పిస్తున్నామని వివరించారు. ఆర్టీసీ ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

# ఓట్ల తొలగింపునకు కుట్ర!

## ఎస్ఐఆర్ ప్రక్రియతో ముస్లిం ఓట్లకే ఎసరు

## బెంగాల్, బీహార్ రాష్ట్రాలే నిదర్శనం.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

## మంత్రి అజారుద్దీన్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ ,జూన్ 17:** సర్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా తెలంగాణలో ముస్లిం ఓట్లను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని మంత్రి అజారుద్దీన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో పశ్చిమబెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో ముస్లింల ఓట్లు తొలగించే బీజేపీ అధికారంలోకి వచ్చిందని, రాష్ట్రంలోనూ అలాంటి ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమ ఓటును కాపాడుకోవాలని ఆయన హెచ్చరించారు. బుధవారం గాంధీభవన్ లో మీడియాతో అజారుద్దీన్ మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఓట్ల తొలగింపుపైనే ఎన్నికల్లో గెలుపోటములు ఆధారపడి ఉంటాయన్నారు. ఇక తన భాషపై వస్తున్న విమర్శలకు స్పందిస్తూ.. తనకు తెలుగు చదవడం, రాయడం వచ్చని, కానీ మాట్లాడేటప్పుడు తప్పులు దొర్లుతాయన్న ఇబ్బందితోనే తనకు సులభంగా ఉండే భాషలో మాట్లాడుతున్నానని వివరించారు.

## ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లిస్తున్నాం..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో అద్భుతమైన పాలన సాగుతోందని అజారుద్దీన్ ప్రశంసించారు. గత ప్రభుత్వం పెండింగ్ లో పెట్టిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను తమ ప్రభుత్వమే చెల్లిస్తోందని గుర్తుచేశారు. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రచారం చేసుకోకుండా 200 మందికి పైగా పేదలకు సాయం చేశానని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని ఆయన వెల్లడించారు.

చురకలు





# నిష్పాక్షిక సంస్కరణా? రాజకీయ వివాదాలకా కేంద్రబిందువు?

## ప్రత్యేక ఓటరు సవరణపై దేశవ్యాప్తంగా చర్చ

దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఓటరు జాబితాలను మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా మార్చడమే లక్ష్యమని ఎన్నికల సంఘం చెబుతుండగా, ప్రతిపక్షాలు మాత్రం ఈ ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికలకు ముందు చేపడుతున్న ఈ కార్యక్రమం వల్ల ప్రతిపక్షాలకు అనుకూలంగా ఉన్న ఓట్ల తొలగింపునకు అవకాశం కల్పిస్తున్నారంటూ ఆరోపిస్తున్నాయి. భారత రాజ్యాంగంలోని 324వ అధికరణం ప్రకారం ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితాల సంరక్షణ బాధ్యత ఎన్నికల సంఘానిదే. ప్రతి ఏడాది సాధారణ సవరణ ప్రక్రియ నిర్వహించినప్పటికీ, జనాభా మార్పులు, వలసలు, పట్టణీకరణ, ద్వంద్వ నమోదులు వంటి సమస్యల కారణంగా సమగ్ర ప్రక్షాళన అవసరమైందని ఎన్నికల సంఘం వివరిస్తోంది. ప్రస్తుతం దేశంలో నమోదిత ఓటర్ల సంఖ్య 100 కోట్లకు పైగా ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల వ్యవస్థగా భారతదేశం నిలిచిన నేపథ్యంలో, ఓటరు జాబితాల ఖచ్చితత్వం అత్యంత కీలకమని అధికారులు చెబుతున్నారు. మరణించినవారి పేర్లు, ఒకే వ్యక్తికి బహుళ నమోదులు, తప్పుడు చిరునామాలతో ఉన్న నమోదులను గుర్తించి తొలగించేందుకు ఈ ప్రత్యేక సవరణ చేపట్టినట్లు వెల్లడించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధ్రువీకరిస్తున్నారు. కొత్తగా అర్హులైన వారిని జాబితాలో చేర్చడం, తప్పుల సవరణ, అభ్యంతరాల స్వీకరణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు కూడా డ్రాఫ్ట్ జాబితాలు అందజేస్తున్నట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌జేడీ తదితర పార్టీలు ఈ ప్రక్రియపై సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. పేదలు, వలస కార్మికులు, గిరిజనులు, పట్టణ మురికివాడల ప్రజలు సరైన పత్రాలు సమర్పించలేక ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల ముందు భారీ స్థాయిలో ఓటరు జాబితాల ప్రక్షాళన చేపట్టడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొంటున్నాయి. భారతీయ జనతా పార్టీతో పాటు అధికార కూటమి ఈ కార్యక్రమాన్ని పూర్తిగా సమర్థిస్తోంది. బోగస్ ఓట్లు, ద్వంద్వ నమోదులు, అక్రమ ఓటింగ్‌కు అడ్డుకట్ట వేయడానికి ఓటరు జాబితాల శుద్ధి అవసరమని చెబుతోంది. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని స్పష్టం చేస్తోంది.

ఓటరు జాబితాలపై వివాదాలు కొత్తవి కావు. 2018 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు, 2019 పశ్చిమ బెంగాల్ ఎన్నికలు, 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో కూడా ఓట్ల తొలగింపుపై ఆరోపణలు వెల్లువెత్తాయి. కొంతమంది అర్హుల పేర్లు జాబితాలో లేకపోవడం, మరోవైపు బోగస్ నమోదులపై విమర్శలు రావడం తరచూ జరుగుతూనే ఉంది. ప్రతి సవరణ ప్రక్రియలో కోట్లాది కొత్త ఓటర్లు నమోదవుతుండగా, అనర్హులైన లేదా మరణించిన వారి పేర్లు తొలగించబడుతున్నాయని ఎన్నికల సంఘం గణాంకాలు సూచిస్తున్నాయి. అయితే ఏ ఒక్క అర్హుడి ఓటు హక్కు కూడా హరించబడకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియ విజయవంతం కావాలంటే పూర్తి పారదర్శకత, ప్రజలకు విస్తృత అవగాహన, రాజకీయ పార్టీల సహకారం, పౌర సమాజ పర్యవేక్షణ అవసరమని విశ్లేషకులు సూచిస్తున్నారు. ఎస్ఐఆర్ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే సంస్కరణగా నిలుస్తుందా, లేక రాజకీయ వివాదాలకే పరిమితమవుతుందా అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

### రాజ్యాంగబద్ధ ప్రాధాన్యత - సంస్కరణల నేపథ్యం

భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు సంపూర్ణమైన, నిష్పాక్షికమైన ఎన్నికల ప్రక్రియే ప్రాణాధారం అని చెప్పక తప్పదు. ఓటరు జాబితా ఎంత ఖచ్చితంగా, పారదర్శకంగా ఉంటే ప్రజాస్వామ్య పునాదులు అంతగా బలపడతాయి. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన 'ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం' (ఎస్ఐఆర్ - స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) తీవ్ర రాజకీయ చర్చకు, మేధోమథనానికి దారితీసింది. అధికారికంగా ఇది ఓటరు జాబితాల్లోని దీర్ఘకాలిక లోపాలను సరిచేయడం, నకిలీ, అర్హతలేని ఓటర్లను తొలగించడం, అర్హులైన ప్రతి పౌరుడిని జాబితాలో చేర్చడం కోసం తలపెట్టిన బృహత్తర సంస్కరణగా ఎన్నికల సంఘం పేర్కొంటోంది. అయితే, ప్రతిపక్షాలు మాత్రం దీనిని ఎన్నికల ముంగిట అధికార పక్షానికి లబ్ధి చేకూర్చేలా, ఒక వ్యూహం ప్రకారం ప్రతిపక్ష సానుభూతిపరుల ఓట్లను గైర్హాజరు చేసేందుకు ఉద్దేశించిన రాజకీయ ప్రేరిత చర్యగా తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఈ భిన్న దృక్పథాల నేపథ్యంలో ఎస్ఐఆర్ సాధ్యాసాధ్యాలను, దాని పూర్వాపరాలను, చారిత్రక పరిణామాలను సమగ్రంగా విశ్లేషించాల్సిన అవసరముంది.

# 30లోగా కేవైసీ, బయోమెట్రిక్ చేసుకోవాలి

## పూర్తి చేయకుంటే గ్యాస్ సబ్సిడీ కట్!

### గ్యాస్ వినియోగదారులకు కేంద్రం మెలిక



**న్యూఢిల్లీ, జూన్ 17:** వంటగ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఉజ్వల పథకం లబ్దిదారులతో పాటు సబ్సిడీ పొందుతున్న సాధారణ గ్యాస్ వినియోగదారులు కూడా జూన్ 30 లోగా తమ బయోమెట్రిక్ పక్రియను కచ్చితంగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఈ గడువులోగా బయోమెట్రిక్ పూర్తి చేయని వారి ఖాతాల్లో సబ్సిడీ జమ కాకుండా నిలిపివేయనున్నారు. ఏడాదిగా ఈ-కేవైసీ పక్రియ కొనసాగుతున్నా ఇంకా పూర్తి కాకపోవడంతో ఈ నెల 30లోపు పూర్తి చేయాలని కేంద్రం నిర్దేశించింది. ఒకవేళ జూన్ 30 గడువు దాటిన తర్వాత బయోమెట్రిక్ పూర్తి చేసుకుంటే.. ఆ తేదీ తర్వాత తీసుకునే సిలిండర్లకు మాత్రమే సబ్సిడీ లభిస్తుంది. గడువు ముగిసిన రోజు నుంచి బయోమెట్రిక్ పూర్తయ్యే మధ్య కాలంలో తీసుకునే సిలిండర్లపై సబ్సిడీని పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని కేంద్రం తన సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మే 18న జారీ చేసిన ప్రకటన ప్రకారం.. బయోమెట్రిక్ పక్రియ పూర్తి కాలేదనే నెపంతో వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ల సరఫరాను మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ నిలిపివేయకూడదు. అయితే, క్షేత్రస్థాయిలో అందుతున్న సమాచారం ప్రకారం.. బయోమెట్రిక్ పూర్తి చేయని వారికి సిలిండర్ల డెలివరీని ఆలస్యం చేయాలని లేదా నిలిపివేయాలని ఆయిల్ కంపెనీల నుంచి గ్యాస్ డీలర్లకు అనధికారిక ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరగడంతో, ఇటీవల జూన్ 7న సిలిండర్ ధరను రూ.29 మేర పెంచారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో సబ్సిడీ లేని గృహోపయోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.994 పలుకుతోంది. కేంద్రం ఉజ్వల పథకం కింద ప్రతి సిలిండర్‌పై రూ.300 సబ్సిడీ ఇస్తుండగా, మిగిలిన అర్హులైన సాధారణ వినియోగదారుల బ్యాంక్ ఖాతాల్లో స్వల్ప మొత్తంలో సబ్సిడీ జమ అవుతోంది. మరోవైపు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తోంది. రాష్ట్రంలో సుమారు 1.26 లక్షలకు పైగా క్రియాశీలక గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఇండియన్ ఆయిల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ కంపెనీలు బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోని వారి వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో కూడా పంచుకోనున్నాయి. గ్యాస్ కనెక్షన్ తీసుకున్నప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయని వారు వెంటనే తమ పరిధిలోని గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి ఈ పక్రియను పూర్తి చేసుకోవాలి. జూన్ 30 లోగా ఈ పని పూర్తి చేసుకుంటేనే ఎలాంటి అంతరాయం లేకుండా సబ్సిడీ డబ్బులు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయి. గ్యాస్ కనెక్షన్లను ఆధార్‌తో అనుసంధానం చేయడంతో పాటు ముఖ గుర్తింపు, వేలిముద్రలు లేదా ఐరిస్ వంటి మూడు విధానాలతో ఎల్పీజీ వినియోగదారుల ఈ-కేవైసీని పూర్తి చేయనున్నారు. ఈ పక్రియ కోసం వినియోగదారులే నేరుగా ఆయిల్ కంపెనీల మొబైల్ యాప్ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చు. గ్యాస్ ఏజెన్సీల డీలర్ల వద్ద ఈ-కేవైసీ పూర్తి చేసేందుకు కూడా అవకాశం కల్పించారు. కొన్ని గ్యాస్ ఏజెన్సీలు గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలోనే ఈ పక్రియను పూర్తి చేస్తున్నాయి.

# అమెరికా అధ్యక్ష భవనంపై భారీ ఉగ్రదాడికి కుట్ర

■ ముందే పసిగట్టి అడ్డుకున్న ఇంటిలిజెన్స్

**వాషింగ్టన్, జూన్ 17:** అమెరికా అధ్యక్ష భవనంపై భారీ ఉగ్రదాడి చేసేందుకు పన్నిన కుట్రను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ భగ్నం చేసింది. డొనాల్డ్ ట్రంప్ 80వ పుట్టిన రోజు సందర్భంగా వైట్‌హౌస్‌లో నిర్వహించిన యూఎఫ్‌సీ ఈవెంట్‌ను లక్ష్యంగా చేసుకుని డ్రోన్లు, స్నైపర్లతో దాడి చేయాలని కొందరు వ్యక్తులు పన్నిన కుట్రను అధికారులు ముందుగానే గుర్తించి అడ్డుకున్నారు. ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎఫ్‌బీఐ వెల్లడించింది. నిందితులు ఐదుగురిలో ఒకరైన 19 ఏళ్ల టైసెన్ ప్రాపర్ తల్లి ఇచ్చిన సమాచారంతోనే ఎఫ్‌బీఐ ఈ కుట్రను భగ్నం చేసింది. గూఢచర్యం, భారీగా ఆయుధాలు కొనుగోలు చేయడం, హిట్ అండ్ రన్ మిషన్ల గురించి కొందరితో అతడు మాట్లాడుతుండడాన్ని ఆమె గమనించి అనుమానించింది. వెంటనే ఆమె స్థానిక పోలీసులకు సమాచారం అందించింది. దీంతో ఎఫ్‌బీఐ అప్రమత్తమై నిందితులను అదుపులోకి తీసుకుంది. ఎఫ్‌బీఐ అధికారులు చెప్పిన వివరాల ప్రకారం.. నిందితులు పేలుడు పదార్థాలు అమర్చిన డ్రోన్లతో వైట్‌హౌస్ సమీపంలోని భవనాలపై దాడి చేసి, ప్రజల్లో భయాందోళనలు సృష్టించాలనుకున్నారు. అనంతరం బయటకు పరుగులు తీసే ప్రజలపై స్నైపర్లతో కాల్పులు జరపాలనుకున్నారు. కొందరు నిందితులు ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ యాప్‌ల ద్వారా ప్రణాళికలు రూపొందించినట్లు దర్యాప్తులో తేలింది. ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాశ్ పటేల్ దీనిని ఒక పెద్ద ఉగ్రదాడి కుట్రగా అభివర్ణించారు. సరైన సమయంలో చర్యలు తీసుకోకపోయి ఉంటే భారీ ప్రాణనష్టం సంభవించేదని పేర్కొన్నారు. ఈ బృందంలోని వ్యక్తులకు ఒకరితో ఒకరికి సంబంధం లేదని ఎఫ్‌బీఐ అధికారులు తెలిపారు. వీరంతా ప్రభుత్వ వ్యతిరేకులని, లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఫైళ్లపై ట్రంప్ యంత్రాంగం తీరుతో నిరాశ చెందిన వారని, యూదు వ్యతిరేకులని పేర్కొన్నారు. ప్రస్తుతం అరెస్టు చేసిన వారిపై అధికారులు పలు కేసులు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.





# సైబర్ నేరస్థులు 'పరాన్నజీవులు'..

### సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, జూన్ 16:** సైబర్ నేరస్థులు అమాయక ప్రజలను మోసంచేసి కోట్లాది రూపాయలు కాజేసే పరాన్నజీవులని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న వారిపై చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. ఈ మేరకు ఓ సైబర్ ఫ్రాడ్ కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరించి, సదరు పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది న్యాయస్థానం. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా.. సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సైబర్ నేరాలపై పెరుగుతున్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలను ఆకర్షించి భారీ లాభాలొస్తాయని నమ్మబలికి వారిని మోసగించే వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమంది. 'మీరు పరాన్నజీవులు.. పెట్టుబడిదారుల నుంచి డబ్బు తీసుకుని మోసం చేస్తున్నారు. మీలాంటి వారు జైల్లో ఉండటమే సమాజానికి శ్రేయస్కరం. సైబర్ నేరస్థుల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలి. ఇలాంటి నేరాలు ఎప్పుడూ పాన్ ఇండియా స్థాయిలో జరుగుతూ ఉంటాయి. గుజరాత్‌లో ఒకరు, ఆ తర్వాత ముంబై మరొకరి నుంచి.. ఇలా అందరి నుంచి డబ్బులు వసూలు చేస్తారు' అని ధర్మాసనం పేర్కొంది. ఈ సందర్భంగా కోర్టుకు అందించిన వివరాలను ప్రస్తావిస్తూ.. గతేడాది చివరి నాటికి దేశంలో డిజిటల్ మోసాల కారణంగా రూ.3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు పేర్కొంది న్యాయస్థానం. సైబర్ నేరాల తీవ్రతను ఇది విస్పష్టంగా తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది. కాగా.. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం.. 2021 నుంచి 2023 మధ్య సుమారు 63 శాతం సైబర్ మోసాలు పెరగడంతో కేసుల సంఖ్య 86 వేల మార్కును దాటింది. వీటిలో కర్ణాటక తొలి స్థానంలో ఉండగా.. తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# ఐఎస్ఐ ఉగ్ర ముఠా గుట్టురట్టు

## ఏడుగురు అరెస్ట్..

### పుల్వామా తరహా కుట్ర కోణంలో దర్యాప్తు



**న్యూఢిల్లీ, జూన్ 16:** పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ మద్దతుతో భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఉగ్ర ముఠాను ఢిల్లీ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. అరెస్టైన వారిలో ఆరుగురు ఉత్తరప్రదేశ్‌లోని గాజియాబాద్‌కు చెందిన వారిగా గుర్తించారు. దర్యాప్తులో భాగంగా గాజియాబాద్‌కు చెందిన నలుగురు నిందితులు గతంలో జమ్మూ-కశ్మీర్‌లోని పుల్వామా ప్రాంతాన్ని సందర్శించినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి సేకరించిన సున్నితమైన సమాచారాన్ని పాకిస్థాన్‌కు పంపినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పుల్వామా తరహాలో మరో ఉగ్రదాడికి కుట్ర పన్నుతున్నారా అనే కోణంలో భద్రతా సంస్థలు విచారణ జరుపుతున్నాయి. నిందితులు ఢిల్లీ నుంచి జమ్మూ వరకు ఉన్న కీలక రైల్వే స్టేషన్ల వద్ద సోలార్ ఆధారిత సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి భారత సైనికుల కదలికలను గమనించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటికే ఢిల్లీలోని కాంట్ రైల్వే స్టేషన్, హరియాణాలోని సోనిపట్ రైల్వే స్టేషన్ వద్ద ఇటువంటి కెమెరాలు అమర్చినట్లు గుర్తించినట్లు వెల్లడించారు. దర్యాప్తులో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. భారతీయ మొబైల్ నంబర్లకు వచ్చే ఓటీపీలను విదేశాల్లో ఉన్న వ్యక్తులకు చేరవేస్తూ వాట్సాప్, ఇతర సోషల్ మీడియా ఖాతాల నిర్వహణకు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఇందుకు ఒక్కో లావాదేవీకి రూ.500 నుంచి రూ.5 వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. సిమ్ కార్డుల చోరీ, ఇప్పటికే యాక్టివేట్ చేసిన సిమ్‌ల కొనుగోలు వంటి అక్రమ మార్గాలను నిందితులు వినియోగించినట్లు తేలింది. ఆర్థిక లావాదేవీలను తమ ఖాతాల ద్వారా కాకుండా జనసేవా కేంద్రాలు, స్థానిక దుకాణాల ద్వారా నగదు రూపంలో నిర్వహిస్తూ పోలీసుల కళ్లుగప్పేందుకు ప్రయత్నించినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో మరికొందరి ప్రమేయంపై కూడా విచారణ కొనసాగుతోందని, దేశ భద్రతకు ముప్పుగా మారే ఉగ్ర నెట్‌వర్క్‌లపై కఠిన చర్యలు కొనసాగిస్తామని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు.

## కల్లూరు మున్సిపాలిటీలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



**సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో 17వ వార్డులో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, 17వ వార్డు కౌన్సిలర్ కనపర్తి శ్యామల రాజ్కుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్ ప్రాంతంలో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కాలనీలోని రహదారులు, డ్రైనేజీలు, చెత్త నిల్వ ప్రాంతాలను శుభ్రపర్చారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అలాగే ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని పరిశుభ్రమైన వార్డు నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

## అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు నూతన దుస్తుల పంపిణీ



**గుడిహత్నూర్:** గుడిహత్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని జవహర్నగర్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ ఆడే శీల ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే పిల్లలకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యను అందించడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని పిల్లల భవిష్యత్తు కోసం కృషి చేయాలని సూచించారు. వార్డు సభ్యుడు షేక్ మహబూబ్ మాట్లాడుతూ కాలనీలోని అంగన్వాడీ కేంద్రం అభివృద్ధి, బలోపేతానికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సంగీత, వీఓఏ, చిన్నారుల తల్లిదండ్రులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

### నేరడిగొండలో విషాదం



**నేరడిగొండ:** నేరడిగొండ మండలంలో బుధవారం విషాద ఘటన చోటుచేసుకుంది. మండలంలోని లఖంపూర్ (జి) గ్రామానికి చెందిన ఆత్రం లక్ష్మణ్ (38) ప్రమాదవశాత్తు కిందపడడంతో మృతి చెందినట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. ఆత్రం లక్ష్మణ్ చికెన్ కొనుగోలు కోసం మధ్యాహ్నం తన గ్రామం నుంచి నేరడిగొండకు వచ్చాడు. క్కడ ఓ చికెన్ షాపు వద్ద ఉండగా అనుకోకుండా కిందపడిపోయినట్లు స్థానికులు తెలిపారు.గ్రామ సర్పంచ్ భర్త గంగాధర్ ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోగా, అప్పటికే లక్ష్మణ్ మృతి చెందినట్లు గుర్తించారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు. ఇది ప్రమాదవశాత్తు జరిగిన మరణమేనని, ఘటనపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని మృతుడి బంధువులు తెలిపారు. అయినప్పటికీ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## వేంసూర్ డిప్యూటీ తహశీల్దార్గా లక్ష్మణ్ బాధ్యతల స్వీకరణ



**సత్తుపల్లి:** వేంసూర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో నూతన డిప్యూటీ తహశీల్దార్గా లక్ష్మణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డిప్యూటీ తహశీల్దార్గా విధులు నిర్వహిస్తున్న బంతి రామ్ బదిలీపై కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లడంతో ఆయన స్థానంలో లక్ష్మణ్ నియమితులయ్యారు. లక్ష్మణ్ గతంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ)గా పనిచేసి, పదోన్నతి పొందిన అనంతరం డిప్యూటీ తహశీల్దార్ హోదాలో వేంసూర్కు వచ్చారు. ఇటీవల నేలకొండపల్లి సివిల్ సప్లై శాఖలో ఆర్ఐగా విధులు నిర్వహించిన ఆయన పదోన్నతి ద్వారా ఈ బాధ్యతలు చేపట్టారు. అంతేకాకుండా వేంసూర్లో నాలుగు సంవత్సరాల పాటు ఆర్ఐగా పనిచేసిన అనుభవం ఉండటంతో స్థానిక పరిస్థితులపై ఆయనకు మంచి అవగాహన ఉంది. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మణ్ను మాజీ ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, భీమవరం మాజీ సర్పంచ్ గరిగంటి రాంబాబు శాలువాతో సత్కరించారు. నూతన బాధ్యతల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత




**ఆసిఫాబాద్ :** జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరూ తపాలా శాఖలో ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన పాలసీ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల పాలన అధికారి ఛాంబర్ లో జీవన్ జ్యోతి బీమా దారుల కుటుంబాలకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ మంచిర్యాల బ్రాంచ్ లో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన క్రింద బెజ్జూర్ మండలం మొగవెల్లి గ్రామానికి చెందిన సిహెచ్. లక్ష్మి మరణించినందున నామిని అయిన పెంటు బాయికి 2 లక్షల రూపాయల చెక్కు అందించడం జరిగిందని తెలిపారు. అదే గ్రామానికి చెందిన కనక కమల రాయల్ సుందరం పథకంలో 565 రూపాయలు ప్రీమియం చెల్లించి బీమా చేసుకున్నారని, సదరు కమల ప్రమాదవశాత్తు పాముకాటుకు గురై మరణించారని, ఈమె కుమారుడు కనక సుధాకర్ కు 10 లక్షల రూపాయల బీమా చెక్కును అందించడం జరిగిందని తెలిపారు. తపాలా శాఖలో కేవలం సంవత్సరానికి 565 రూపాయల ప్రీమియం చెల్లించి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన క్రింద బీమా చేసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, 18-65 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ సీనియర్ మేనేజర్ కొట్టే శ్రీనివాస్, మేనేజర్ సాగర్, రాయల్ సుందరం కంపెనీ రీజనల్ మేనేజర్ ధన్ రాజ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత





**ఆసిఫాబాద్ :** ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, వైద్యులు, సిబ్బంది బయోమెట్రిక్ హాజరు నమోదు వివరాలను పరిశీలించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రజలను వైద్యులు అందిస్తున్న సేవలు, పాలు, బ్రెడ్డు, అల్పాహారం, భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి లోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. మారుమూల గిరిజన గ్రామాల నుండి చికిత్సల కొరకు వచ్చే ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. ప్రతిరోజు ఆసుపత్రిలో సేవలు పొంది డిశ్చార్జ్ అవుతున్న రిజిస్టర్ ను పరిశీలించిన అనంతరం ఆసుపత్రి బయట రహదారి పైగల మురుగు కాలువలలో చెత్తను వెంటనే తొలగించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఆసుపత్రి పర్యవేక్షకులు ప్రవీణ్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాదాపూర్ సర్పంచ్ షేక్ ఇమ్రాన్ షాదుల్లాకు ఘన సన్మానం



**ఇచ్చోడ:** ఇచ్చోడ మండలం మాదాపూర్ గ్రామ సర్పంచ్ షేక్ ఇమ్రాన్ షాదుల్లాకు రాష్ట్ర స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. మంగళవారం హైదరాబాద్లోని రవీంద్రభారతి వేదికగా బీసీ టైమ్స్, బీసీ సమాజ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల్లో విజయం సాధించిన బీసీ ముస్లిం సర్పంచులను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సత్కార కార్యక్రమంలో సర్పంచ్ ఇమ్రాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు, రాష్ట్ర స్థాయి ప్రముఖులు ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. రాష్ట్ర రాజధానిలో ఇంతటి గౌరవం లభించడం పట్ల సర్పంచ్ షేక్ ఇమ్రాన్ షాదుల్లా హర్షం వ్యక్తం చేశారు. ఈ సన్మానం తనపై మరింత బాధ్యతను పెంచిందని, గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. తనను ప్రోత్సహించి సత్కరించిన బీసీ టైమ్స్, బీసీ సమాజ్ నిర్వాహకులకు, అలాగే తనకు అండగా నిలిచిన మాదాపూర్ గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సన్మానం మాదాపూర్ గ్రామానికి గర్వకారణమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తొడసం దౌలత్రావుకు ఘన సన్మానం



**గుడిహత్నూర్:** మండలంలోని మల్కాపూర్ గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తొడసం దౌలత్రావును గ్రామస్తులు సాదరంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు మౌలిక వసతుల సమస్యలపై గ్రామస్తులు ఆయనతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తాగునీరు, సాగునీటి సౌకర్యాల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు, గ్రామ పరిశుభ్రత వంటి అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను తెలుసుకున్న తొడసం దౌలత్రావు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మల్కాపూర్ గ్రామ సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం త్వరితగతిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అటవీశాఖ అధికారిణి శాంతాను గ్రామస్తులు, నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్, గ్రామ దేవారి, మహాజన్, ఉప సర్పంచ్, యువజన నాయకులు, రైతులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పట్టణ సమగ్ర అభివృద్ధే మా లక్ష్యం

- మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్
- రూ.18.50 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమిపూజ
- త్వరలో రూ.100 కోట్ల అభివృద్ధి పనులు



**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. పట్టణాభివృద్ధిలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో యూఐడీఎఫ్ పథకం కింద చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే పాయల శంకర్తో కలిసి భూమిపూజ నిర్వహించారు. మొత్తం రూ.18.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న మౌలిక సదుపాయాల పనుల్లో భాగంగా గాంధీ పార్క్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.26 లక్షలు, పిట్టలవాడ కాలనీలో రూ.10 లక్షలు, రాంనగర్ కాలనీలో రూ.32 లక్షలు, డాల్డా కంపెనీ ప్రాంతంలో రూ.25 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ పట్టణంలోని 49 వార్డుల ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో టీయూఎఫ్ఐడీసీ గ్రాంట్ల ద్వారా మరో రూ.50 కోట్ల నిధులను తీసుకురానున్నట్లు వివరించారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో సుమారు రూ.100 కోట్లకు పైగా అభివృద్ధి పనుల ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని, అవి త్వరలోనే మంజూరవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నిధులు అందుబాటులోకి వచ్చిన వెంటనే మరిన్ని అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, తాగునీటి సరఫరా వంటి ప్రాథమిక సేవల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ను సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, ఈఈ అరుణ్ కుమార్, డీఈ, ఏఈలు, స్థానిక కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్ :** జిల్లాలో ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఈనెల 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ వరకు నిర్వహించవలసి ఉన్నందున జిల్లాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా భవన సమావేశ మందిరంలో జిల్లా మీడియా ప్రతినిధులతో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై ప్రజలలో అవగాహన కల్పించాలని, అవసరమైన ధ్రువపత్రాలను ఫారం తో పాటు బూతు స్థాయి అధికారులకు అందజేయాలని తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ప్రతి ఒక్కరు సభ్యత్వం చేసుకోవాలని, భారతీయ తపాలా శాఖలో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా పథకం క్రింద అర్హులైన ప్రతి ఒక్కరూ 565 రూపాయలు చెల్లించి బీమా పొందేలా దినపత్రికలు, వివిధ ప్రచార, ప్రసార సాధనాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి సంపత్ కుమార్ పాల్గొన్నారు.

చురకలు



# ఆదివాసీలపై అటవీ అధికారుల దాడిని ఖండిస్తున్నాం

- **ఐటీడీఏ పీఓకు సోయం బాపూరావు వినతి**




**ఆదిలాబాద్:** నిర్మల్ జిల్లా కడెం మండలంలోని ఉడుంపూర్ పంచాయతీ పరిధిలోని మైసంపేట్, రాంపూర్ గ్రామాల ఆదివాసీలపై అటవీ అధికారులు వ్యవహరిస్తున్న తీరును, వారిపై జరుగుతున్న దాడులను మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు తీవ్రంగా ఖండించారు. బాధిత కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఐటీడీఏ పీఓ మంద మకరందుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సోయం బాపూరావు మాట్లాడుతూ మైసంపేట్ పునరావాస గ్రామస్తుల వ్యవసాయ భూముల హద్దుల విషయంలో అటవీ అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మహిళలను సైతం చూడకుండా కాళ్లతో తన్నుతూ దాడులకు పాల్పడటం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ అధికారులు కావాలనే ఆదివాసీల మధ్య చిచ్చు పెడుతూ, అమాయక గిరిజనులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. దాదాపు 20 మంది ఆదివాసీలను అదుపులోకి తీసుకున్నప్పటికీ, వారిని ఎక్కడ ఉంచారనే విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. గత 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవడానికి అధికారులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. గతంలో టైగర్ జోన్ పేరుతో గిరిజనులను తరలించే ప్రయత్నాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అడ్డుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ అధికారులు రెండు నెలల క్రితమే భూముల హద్దులు చూపించి, ఇప్పుడు మళ్లీ కొత్త వివాదాలు సృష్టిస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఐటీడీఏ పీఓకు వివరించారు. బాధితుల సమస్యలను విన్న ఐటీడీఏ పీఓ మంద మకరందు సంబంధిత అధికారులతో మాట్లాడి సమగ్ర విచారణ జరిపిస్తామని, బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆదివాసీల హక్కులను కాలరాస్తే సహించబోమని, గిరిజనులపై దాడులకు పాల్పడిన అధికారులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని సోయం బాపూరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, రాజ్ గోండ్ సేవ సమితి నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బొజ్జుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బోరంచు



**ఆదిలాబాద్:** ఉట్నూర్లోని తిరుమల గార్డెన్లో నిర్వహించిన ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ జన్మదిన వేడుకలకు ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రేండ్ల రాజన్న, అట్ల గోవర్ధన్ రెడ్డి, మోసిన్, అలీమ్, రావుల ప్రవీణ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# బేల పద్మావతి మహిళా సమాఖ్యకు ఆర్టీసీ బస్సు అందజేత

- **సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకం**

**బేల:** ఇందిరా మహిళా శక్తి పథకం కింద బేల మండలంలోని పద్మావతి మహిళా సమాఖ్యకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్టీసీ బస్సును అందజేసింది. ఈ సందర్భంగా బుధవారం బేల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి, సమాఖ్య అధ్యక్షురాలు మంజూష మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా స్వాలంబన చేసేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ఇందిరా మహిళా శక్తి పథకాన్ని తీసుకువచ్చిందని పేర్కొన్నారు. సొంతంగా బస్సు కొనుగోలుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించగా, ఆ బస్సును ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ద్వారా మహిళా సమాఖ్యకు నెలకు రూ.69వేల స్థిర ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఈ పథకం మహిళల ఆర్థిక సాధికారతకు దోహద పడుతుందని అన్నారు. మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి



విక్రమార్క, మంత్రి సీతక్కలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రూప్రావు, విలాస్ పటేల్, వామన్ వంకడే, అశోక్ పటేల్, సంజీవ్ గుండవార్, బేల సోషల్ మీడియా కోఆర్డినేటర్ మేకల జితేందర్, ప్రభాకర్, దేవిదాస్, జీవన్, సోహన్, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అనిల్ జాదవ్కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేజీబీవీ సిబ్బంది



**నేరడిగొండ:** బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేజీబీవీ ప్రత్యేక అధికారి రజిత సమక్షంలో సిబ్బంది ఎమ్మెల్యే అనిల్ జాదవ్కు స్వీట్లు తినిపించి, శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

# గృహ నిర్మాణ పనులు గడువులోగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్:** జిల్లాలో గృహ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల అనుమతులు, నిర్మాణాల పురోగతి, డబుల్ బెడ్రూమ్ ఇండ్ల కేటాయింపు ప్రక్రియ, మౌలిక వసతుల కల్పనపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మావల, కెఆర్కె కాలనీలలోని డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు అవసరమైన మౌలిక వసతులు, పెండింగ్ పనులను జూలై 15 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. సివిల్ పనులు, అంతర్గత రహదారులు, తాగునీటి సౌకర్యం,



విద్యుద్దీకరణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని పేర్కొన్నారు. పనుల్లో నాణ్యతా లోపాలను ఏమాత్రం సహించబోమని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ అనుమతుల విషయంలో గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకు తొలి ప్రాధాన్యం కల్పించాలని, దీనికి సంబంధించిన నివేదికలను త్వరితగతిన సమర్పించాలని ఆదేశించారు. మావల, బొక్కలగూడ, ఎస్సీ కాలనీల్లో పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్, పీడీ హౌసింగ్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, పీడీ హౌసింగ్ శంకర్, మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, జెడ్పీ సీఈఓ భూక్యా రవి, ఆర్అండ్బీ ఈఈ నర్సయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పాములవాడ పాఠశాలలో ఘనంగా ఎఫ్ఎల్ఎన్ డే వేడుకలు




**జైనూర్:** సిర్పూర్(యు) మండలంలోని పాములవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం (ఎఫ్ఎల్ఎన్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం ప్రత్యేక విద్యా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి, అవగాహన పెంపొందించే లక్ష్యంతో పలు విద్యా సంబంధిత ఆటలు, ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రతి చిన్నారి మూడో తరగతి పూర్తి చేసేలోగా అర్థం చేసుకుంటూ చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలను సాధించడం ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. పిల్లలకు కూడికలు, తీసివేతలు వంటి ప్రాథమిక గణిత అంశాలను ఆటపాటల రూపంలో నేర్పించడం ద్వారా అభ్యసనాన్ని సులభతరం చేస్తున్నామని చెప్పారు. విద్యార్థుల్లో నేర్చుకునే సామర్థ్యాలను పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అధ్యాపకుల పాత్ర కీలకం

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడంలో అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన జూనియర్ లెక్చరర్ల ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "నాణ్యమైన విద్య– ఉజ్వల భవిష్యత్తు" అనే లక్ష్యంతో ప్రభుత్వం విద్యారంగంలో పలు సంస్కరణలు చేపడుతోందన్నారు. మారుతున్న కాలానికి, సాంకేతికతకు అనుగుణంగా లెక్చరర్లలో బోధనా నైపుణ్యాలను పెంపొందించేందుకు నెల రోజుల శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ఆధునిక బోధనా పద్ధతులను అవలంబించాలని లెక్చరర్లకు సూచించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచనలను పెంపొందించేలా బోధన కొనసాగించాలని కోరారు. నెల రోజులపాటు సాగే ఈ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖ అధికారి జాదవ్ గణేష్ కుమార్, ప్రిన్సిపాల్స్ బస భగవాన్లు, కె.సునీల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వరపతి, జిల్లా




పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, తెలంగాణ మైనారిటీస్ సంక్షేమ విద్యాసంస్థలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల జూనియర్ లెక్చరర్లు, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## బోరిగామాలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

**ఇచ్చోడ:** గ్రామ అభివృద్ధిలో భాగంగా ఇచ్చోడ మండలం బోరిగామా గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. స్థానిక సర్పంచ్ ఆసిఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆసిఫ్తో పాటు ప్రముఖ నాయకులు ప్రవీణ్ రెడ్డి, బద్దం నర్సింహారెడ్డి, అంగుర్ల సంతన్న, బద్దుల రత్న, బద్దం మోహన్ రెడ్డి,



బొల్లి చిన్నాన్న, లింగారెడ్డి, మాచెందర్ రెడ్డి, శరత్ రెడ్డి తదితరులు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని సౌకర్యాలతో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. భవనం పూర్తయిన అనంతరం గ్రామస్తులకు పంచాయతీ కార్యాలయ సేవలు మరింత వేగంగా, సౌకర్యవంతంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# లుంబిని దీక్షభూమి ప్రతినిధులకు ఘన సన్మానం

**ఆసిఫాబాద్:** గోదావరిఖనికి చెందిన డోంగ్రీ సూపర్ మార్ట్ అధినేత్రులు డోంగ్రీ సుగంధ, డోంగ్రీ శారదా ఆధ్వర్యంలో సెంటర్ కమిటీ అధ్యక్షుడు మసాదే ప్రశాంత్, లుంబిని దీక్షభూమి జనరల్ సెక్రటరీ వైరాగడే రాజ్కుమార్లను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్ఎం ప్రతినిధులు మాట్లాడుతూ సెంటర్ కమిటీ, లుంబిని దీక్షభూమి ఆధ్వర్యంలో భవిష్యత్తులో నిత్య అన్నదాన కార్యక్రమం ప్రారంభించినట్లయితే పాన్ ఇండియా స్థాయిలో నాణ్యమైన పప్పులు, కారం, కిరాణా సామగ్రి తదితర వస్తువులను ప్రత్యేక రాయితీ ధరలకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అంతేకాకుండా డీఎస్ఎం లాభాల్లో కొంత భాగాన్ని



ప్రతినెలా నిత్య అన్నదాన కార్యక్రమానికి విరాళంగా అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా సెంటర్ కమిటీ అధ్యక్షుడు మసాదే ప్రశాంత్కు శాలువా కప్పి పూల బొకేతో సత్కరించారు. అలాగే లుంబిని దీక్షభూమి అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా అరటి మొక్కను బహూకరించి, దానిని లుంబిని దీక్షభూమి ప్రాంగణంలో నాటాలని సూచించారు. దీనిపై స్పందించిన మసాదే ప్రశాంత్, వైరాగడే రాజ్కుమార్లు సేవా కార్యక్రమాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలకు అండగా నిలుస్తున్న డోంగ్రీ సూపర్ మార్ట్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంటర్ కమిటీ ప్రచార కార్యదర్శి వైరాగడే లోహాజీ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. అనంతరం డోంగ్రీ సూపర్ మార్ట్ అధినేత్రులు హాజరైన వారందరికీ లడ్డులు పంపిణీ చేసి ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. సామాజిక సేవా కార్యక్రమాలకు డీఎస్ఎం అందిస్తున్న సహకారాన్ని పలువురు అభినందించారు.

# పానపాటర్ గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే కోవా లక్ష్మికి వినతి

**జైనూర్:** పానపాటర్ గ్రామ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ యువ నాయకుడు కొలం శంకర్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే కోవా లక్ష్మిని కలిసి బుధవారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, తాగునీటి సౌకర్యం మెరుగుదల, వీధిదీపాల ఏర్పాటు, కమ్యూనిటీ భవన నిర్మాణం తదితర అభివృద్ధి పనులను చేపట్టాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ ప్రజల సమస్యలు, అవసరాలను వివరించిన కొలం శంకర్ పానపాటర్ గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. వినతి పత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే కోవా లక్ష్మి గ్రామ సమస్యలను పరిశీలించి, అభివృద్ధి పనుల కోసం తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి



చేస్తానని తెలిపారు.

## మాదారం గ్రామంలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**తాండూర్:** మండలంలోని మాదారం గ్రామ పంచాయతీ పరిధిలో గల నూతన క్వార్టర్లో సింగరేణి రోడ్డు నుంచి ఉస్కమల్ల శంకర్ ఇంటి వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఘనంగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్, ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, డీసీసీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో మట్టి రోడ్లు లేకుండా సీసీ రోడ్లు ఉండాలనే లక్ష్యంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ పనులకు మంజూరు లభించిందన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించేందుకు ఈ రోడ్డు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నీలాయపల్లి సర్పంచ్ పోలవేణి తిరుపతి, వార్డు సభ్యుడు గొర్లపల్లి బానేష్, కాంగ్రెస్ నాయకులు జోరిగల రమేష్, మీనుగు కృష్ణ, మీస శంకర్, సిరికొండ సత్యనారాయణ, స్థానికులు ఉస్కమల్ల శంకర్, కొంపల్లి తిరుపతి, సుబ్రమణ్యం, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**




**మంచిర్యాల:** కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య ఆదేశించారు. బుధవారం నస్పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పనులు చేపట్టాలని సూచించారు. నిర్మాణ సామగ్రి నాణ్యతతో పాటు భద్రతా ప్రమాణాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యా సదుపాయాలు, భోజన ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థినులకు సూచించారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యం, పరిశుభ్రతపై కూడా దృష్టి సారించాలని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు నమోదు, అకాడమిక్ రికార్డులు, పరిపాలనా పత్రాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థుల అభ్యాస స్థాయిలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపి మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణం, క్రమశిక్షణ, నాణ్యమైన బోధనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించిన అదనపు కలెక్టర్, వంటగది, స్టోర్రూమ్, తరగతి గదులు, వసతి గదులు తదితర సౌకర్యాలను పరిశీలించి విద్యార్థినుల సంక్షేమం, భద్రతకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు, గుత్తేదారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి
- బడి బాటలో పాల్గొని విద్యార్థులకు పుస్తకాల పంపిణీ





**సత్తుపల్లి:** విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. నియోజకవర్గంలోని వేంసూరు మండల కందుకూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన "బడిబాట" కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు సెల్ఫోన్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లల చదువు, ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రేపటి భవిష్యత్తు ఈనాటి విద్యపై ఆధారపడి ఉంటుందని అన్నారు. గురువులను, తల్లిదండ్రులను, సమాజాన్ని గౌరవించాలని విద్యార్థులకు హితవు పలికారు. అనంతరం సత్తుపల్లి మున్సిపాలిటీ 18వ వార్డులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత, కౌన్సిలర్లు ఆమెతో కలిసి పనుల పురోగతిని సమీక్షించి, నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వేంసూరు ఎంఈఓ వెంకటేశ్వరరావు, కందుకూరు ఇంచార్జ్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ చైర్మన్, ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకటప్ప రెడ్డి, సొసైటీ చైర్మన్ గొర్ల సంజీవ్ రెడ్డి, ఖమ్మం జిల్లా డీసీసీ కార్యదర్శి సోమిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, అట్లూరి సత్యనారాయణ రెడ్డి, బరిణిపాడు నాని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ ప్రతినిధులు, మహిళా, యువజన నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలి

- అధికారులు సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలి
- రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ జి. చంద్రశేఖర్ రెడ్డి



మంచిర్యాల: సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ-2005) అమలును ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని, ప్రభుత్వ శాఖలు అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. బుధవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో రాష్ట్ర సమాచార కమిషనర్లు పి.వి. శ్రీనివాసరావు, మొహ్సినా పర్వీన్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎ.భాస్కర్, అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ఞతో కలిసి జిల్లా అధికారులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సమాచారాన్ని పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందించడం ప్రతి ప్రభుత్వ అధికారి బాధ్యత అని అన్నారు. సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. చట్టం ప్రకారం సమాచారం కోరిన దరఖాస్తులకు 30 రోజుల లోపు సమాధానం ఇవ్వాలని, గడువు దాటిన పక్షంలో సమాచారాన్ని ఉచితంగా అందించాల్సి ఉంటుందని వివరించారు. ప్రతి అధికారి ఆర్టీఐ చట్టంలోని నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అందిన ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించాలని సూచించారు. కమిషన్ ముందు అప్పీళ్ల విచారణ సమయంలో ప్రజా సమాచార అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. సమావేశంలో ప్రథమ అప్పీళ్ల అధికారులు, ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులకు చట్టంలోని నిబంధనలు, అప్పీళ్ల నిర్వహణ, సమాచారాన్ని అందించే విధానాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ సూచనలను అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. సమాచార హక్కు చట్టం అమలులో మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు సత్వర సేవలు అందించాలని సూచించారు. అనంతరం జిల్లాలోని పెండింగ్ అప్పీళ్ల దరఖాస్తులను శాఖల వారీగా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు, వివిధ శాఖల ప్రజా సమాచార అధికారులు, ప్రథమ అప్పీలేట్ అథారిటీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పత్తి విత్తనాల విక్రేతపై పీడీ చట్టం అమలు

- రైతులను మోసం చేస్తున్న వ్యక్తిపై కఠిన చర్యలు
- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా




**మంచిర్యాల:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లా తాండూర్, భీమారం పోలీస్ స్టేషన్ల పరిధిలో నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేస్తున్న విక్రేతపై పీడీ చట్టాన్ని అమలు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా గిద్దలూరు గ్రామానికి చెందిన వూస సుబ్బారావు తాండూర్, భీమిని, భీమారం, బెల్లంపల్లి-2 టౌన్, తాళ్లగురిజాల, నెన్నెల, చెన్నూర్ మండలాల్లో ఏజెంట్లను నియమించుకుని నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాదిలోనే అతనిపై రెండు కేసులు నమోదయ్యాయని, సులభంగా డబ్బు సంపాదించేందుకు అక్రమ మార్గాలను అనుసరిస్తున్నాడని అన్నారు. తాండూర్ సీఐ దేవయ్య, ఎస్సై ప్రసాద్ నిందితుడికి పీడీ ఉత్తర్వులు అందజేసి చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించినట్లు తెలిపారు. సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ వూస సుబ్బారావు 2021 నుంచి 2025 వరకు నకిలీ పత్తి విత్తనాల రవాణా, నిల్వ, విక్రయాలకు సంబంధించిన అనేక క్రిమినల్ కేసుల్లో పాల్గొన్నాడన్నారు. గతంలో 2021లో కూడా అతనిపై పీడీ చట్టం అమలు చేయగా, ప్రభుత్వం దానిని ధృవీకరించినట్లు తెలిపారు. పీడీ చట్టం అమలైన తర్వాత కూడా తన వైఖరిని మార్చుకోకుండా మళ్లీ అదే తరహా నేరాలకు పాల్పడుతూ రామగుండం పోలీస్ కమిషనరేట్, మంచిర్యాల జిల్లా, కొమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా పరిధిలో మొత్తం తొమ్మిది కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని వివరించారు. అమాయక రైతులను నకిలీ పత్తి విత్తనాలను అసలైనవిగా నమ్మించి మోసం చేస్తున్నాడని, ఆంధ్ర ప్రదేశ్ నుంచి నకిలీ విత్తనాలను తీసుకువచ్చి అక్రమంగా విక్రయిస్తున్నాడని తెలిపారు. ఏడాది వ్యవధిలో రెండుసార్లు పట్టుబడినట్లు వివరించారు. నకిలీ విత్తనాల తయారీ, అక్రమ సరఫరా, విక్రయాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని, చట్టవ్యతిరేక కార్యకలాపాలను కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే పీడీ చట్టాన్ని అమలు చేస్తామని హెచ్చరించారు. నకిలీ విత్తనాల అక్రమ వ్యాపారంపై సమర్థవంతంగా చర్యలు తీసుకొని నిందితుడిపై పీడీ చట్టం అమలుకు కృషి చేసిన బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, తాండూర్ సీఐ దేవయ్య, ఎస్సై ప్రసాద్లను అభినందించారు.

## బాధ్యతాయుతమైన జర్నలిజంతోనే సమాజ శ్రేయస్సు





- జిల్లా కలెక్టర్ హరిత
- జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ

**ఆసిఫాబాద్ :** సమాజంలో మీడియా పాత్ర అత్యంత కీలకమైనదని, బాధ్యతాయుతమైన జర్నలిజంతోనే సమాజ శ్రేయస్సు సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ కె హరిత పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులకు, మీడియా ప్రతినిధులకు ఆమె జిల్లా పౌర సంబంధాల అధికారి సంపత్ కుమార్ లతో కలిసి అక్రిడిటేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలోని క్షేత్రస్థాయి వాస్తవాలను, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులు నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఒక బలమైన వారధిగా నిలుస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, జర్నలిస్టులు తమ ఆరోగ్యం, కుటుంబాల సామాజిక భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ హరిత సూచించారు. ఇందులో భాగంగా మానవతా దృక్పథంతో సేవలందించే రెడ్ క్రాస్ సొసైటీలో జర్నలిస్టులందరూ తప్పనిసరిగా సభ్యత్వం తీసుకోవాలని కోరారు. అలాగే తపాలా శాఖ ద్వారా అందిస్తున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద ప్రతి ఒక్కరూ బీమా పాలసీని తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ ఆర్థిక రక్షణ ఆపత్కాలంలో ప్రతి జర్నలిస్ట్ కుటుంబానికి కొండంత అండగా నిలుస్తుందని ఆమె వివరించారు. జర్నలిస్టులు బాధ్యతాయుతమైన కథనాలతో సమాజ ప్రగతికి తోడ్పడాలని కలెక్టర్ ఈ సందర్భంగా దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు అబ్దుల్ రహమాన్, రవి నాయక్, ప్రకాష్ గౌడ్, తుకారాం, వినయ్ కుమార్, సీనియర్ జర్నలిస్టులు బాబు గౌడ్, వేణుగోపాల్ , బాల శ్రీనివాస్ , ఆడప సతీష్, జర్నలిస్టులు మహేష్, రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు

**ఎన్.ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి మౌలానా**



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 16,** :
ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు తమకు రావాల్సిన 2017, 2021 పే స్కేల్ ఏరియర్స్‌తో పాటు ఇతర ఆర్థిక బకాయిల చెల్లింపుల కోసం ఈ నెల 18న హైదరాబాద్‌లోని బస్ భవన్ ఎదుట చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త నిరాహార దీక్షకు నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) సంపూర్ణ మద్దతు ప్రకటించిందని ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి మౌలానా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ కార్మికులందరూ సంఘీభావం ప్రకటించి నిరాహార దీక్షను విజయవంతం చేయాలని కోరారు. ఆర్టీసీలో దాదాపు 37 నుంచి 38 సంవత్సరాలు సేవలందించిన అనేక మంది ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం తమకు చెల్లించాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన అన్ని బకాయిలను యాజమాన్యం తక్షణమే చెల్లించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## రేబర్తి ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ




**మద్దూరు, జూన్ 17,** :
మద్దూరు మండలంలోని రేబర్తి ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ ను బుధవారం ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయులు బాకీ చంద్ర భాను ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు గ్రామ సర్పంచి నీరటి శ్రీనివాస్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్పర్సన్ నిర్మల ఉపాధ్యాయులు కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా ఆలోచనలు పెంచుకుంటూ మంచి కలలను కంటూ ఆ కలలను సాకారం చేసుకోవడానికి విద్య ఒక ఆయుధంగా పనిచేస్తుందని, విద్యనే ఉన్నత శిఖరాలకు చేర్చుతుందని, అందువలన అందరు విద్యార్థులు బాగా చదువుకోవాలని ఈ సందర్భంగా అన్నారు. చైర్ పర్సన్ నిర్మల మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకొని బంగారు భవిష్యత్తు నిర్మాణం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీష, సంపత్ కుమార్, చంద్రారెడ్డి, రవి, మల్లేశం, నర్సింలు, శ్రీనివాస్ రెడ్డి, ప్రశాంత్, కవిత, రఫత్, ఉమర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ సమేతంగా కొండగట్టు అంజన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే గంగుల



**చొప్పదండి ప్రతినిధి, జూన్ 17,** :
జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు ఆలయ సూపరింటెండెంట్ ఉపాధ్యాయుల చంద్ర శేఖర్, అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు వేద పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందించగా, ఆలయ సుపేరెండేంట్ చంద్ర శేఖర్ శేషవస్త్రాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచారి కపిందర్, ఉపప్రధాన అర్చకులు, చిరంజీవి, ముఖ్య అర్చకులు పెద్ద రాము, అభిలాశ్, శ్రీకాంత్, టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్, రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.


## సహచర మిత్రునికి ఆర్థిక సహాయం



**గజ్వేల్ ప్రతినిధి, జూన్ 17,** :
సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ వాస్తవ్యుడు గుండ్ల రమేష్ (37) కడు బీద కుటుంబంలో పుట్టి వ్యవసాయ కూలిగా జీవనం గడుపుతున్నాడు. అనుకోకుండా అతను హార్ట్ ఎటాక్ తో గత వారం క్రింద మృతిచెందాడు. మృతునికి ఇద్దరు పిల్లలు. అందులో ఒక పాప (15) ఒక బాబు (11). వీరు ప్రజ్ఞాపూర్ ప్రభుత్వ స్కూల్లో చదువుతున్నారు. కుటుంబ పోషించే వ్యక్తి చనిపోవడం వల్ల వీరి దీనస్థితిని గమనించిన పదవ తరగతి 2004-2005 బ్యాచ్ కు చెందిన 56 మంది మిత్రులు కలిసి వీరికి మూడు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు, 34 వేల రూపాయలు ఆర్థిక సహాయము అందజేశారు. తోటి మిత్రుడు చనిపోతే ఆపదలో ఉన్న కుటుంబాన్ని ఆదుకోవడం హర్షించదగ్గ విషయమని ఇంటి చుట్టుపక్కల వారు గ్రామస్తులు వారిని అభినందించారు.

# అడ్డగోలుగా మాట్లాడితే నాలుక కోస్తాం

- **కవ్వంపల్లి జోలికొస్తే ఖబడ్దార్ బాలకిషన్**
- **అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు**
- **మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ను హెచ్చరించిన కాంగ్రెస్ నేతలు**



**నంగునూరు, జూన్ 17,** :
అరేయ్ బిడ్డా రసమయి బాలకిషన్ అడ్డగోలుగా మాట్లాడితే నాలుక కోస్తాం జాగ్రత్త అంటూ నంగునూరు మండల ఏఎంసీ చైర్మెన్ దేవులపల్లి యాదగిరి, మండల పార్టీ అధ్యక్షులు తప్పెట శంకర్, కాంగ్రెస్ నాయకులు కాటం కిషన్ లు మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ను హెచ్చరించారు. నంగునూరులో బుధవారం వారు మాట్లాడుతూ మంగళవారం మాన కొండూరు నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ మీటింగ్లో తమ డైనమిక్ లీడర్ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మెన్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కమీషన్ల దొంగ రసమయి బాలకిషన్ తస్మాత్ జాగ్రత్త అంటూ ఫైర్ అయ్యారు. నోరు ఉంది కదా అని అడ్డగోలుగా మాట్లాడితే నాలుక కోస్తాం జాగ్రత్త బిడ్డా అని హెచ్చరించారు. కవ్వంపల్లి సత్యనారాయణపై, కాంగ్రెస్ పార్టీ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని, చూస్తూ ఊరుకోబోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలు మీరు పాలనను గాలికొదిలేసి ఫాంహౌస్ లు కట్టుకొని అందులో పండుకొని ఎంజాయ్ చేస్తేనే కదా మానకొండూరు నియోజకవర్గ ప్రజలు మిమ్మల్ని గెంటేసి మా నాయకుడు కవ్వంపల్లి సత్యనారాయణని గెలిపించారని గుర్తుచేశారు. కాంట్రాక్టులకు, కమిషన్లకు కక్కుర్తి పడి కట్టిన ఒక్క కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టుని పట్టుకొని అగ్గిపెట్టె హరీష్ రావు, నేను ప్రాజెక్టు కట్టినా అని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎస్ఆర్ఎస్పి, కరీంనగర్, నాగార్జున సాగర్, దేవాదుల, శ్రీశైలం, డిండి, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిలసాగర్ ఇలాంటి ప్రాజెక్టులు మీ అయ్య కట్టాడా అని నీలదీశారు. గత 60 సంవత్సరాల కాలం నుండి తెలంగాణను అభివృద్ధి చేసింది కాంగ్రెస్సే అని, ఇప్పుడు చేసేది కూడా కాంగ్రెస్సే గుర్తు పెట్టుకో కమీషన్ల రసమయి అంటూ చురకలంటించారు. తెలంగాణ రాష్ట్ర కళాకారుల సాంస్కృతిక శాఖ చైర్మెన్ గా 500 పోస్టులు అమ్ముకున్న దద్దమ్మవు నువ్వు కదా.. సిగ్గులేని రసమయి.. నువ్వు నియోజక వర్గంలో పీకి కట్టలు కట్టింది ఏం లేకనే కదా నిన్ను బండకేసి కొట్టి మా డైనమిక్ లీడర్ ఎల్లప్పుడు ప్రజలకు అందుబా టులో ఉంటూ వారు కష్టం రాగానే నేను ఉన్నానంటూ నిత్యం ప్రజలతో మమేకమై అందుబాటులో ఉంటున్నారని కాబట్టే మా నాయకున్ని గెలిపించారని చెప్పారు. ఇంకా పది సంవత్సరాలు అయినా మీ బీఆర్ఎస్ తెలంగాణలో అధికారంలోకి రాదని, మీ పతనం ఎప్పుడో మా నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతిలో అంతమయిపోయిందని, ప్రజాపాలనను ప్రజలు అశీర్వదిస్తున్నారని అన్నారు. అందుకే మీకు ఎంపీ ఎలక్షన్స్ లో గుండుసున్నా ఇచ్చారన్నారు. సర్పంచ్ ఎలక్షన్లో, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో పత్తా లేకుండా పోయారని, రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎలక్షన్స్ లో కూడా మీకు వచ్చేది గుండుసున్ననే మిస్టర్ రసమయి బాలకిషన్, ఇకనైనా అడ్డగోలుగా మాట్లాడడం బంజేసుకో, లేదంటే నిన్ను ఉరికించుకుంటూ కొట్టే రోజులు వస్తాయని తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు.

## జిల్లాలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు

- **ఎరువుల గోదాంలు, విక్రయ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 17,** :
జగిత్యాల జిల్లాలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల విక్రయ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా అప్ ద్వారా విక్రయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు కావలిసిన యూరియా నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. అప్ ద్వారా యూరియా బుక్ చేసుకుని కొనుగోలు చేయాలని సూచించారు. సహకార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన గోదాముల నిర్మాణానికి సంబంధించి పనులు తక్షణమే చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్ ను ఆదేశించారు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూరు గ్రామంలో గోదాముల నిర్మాణానికి సంబంధించి ప్రదిపాదిత స్థలాన్ని పరిశీలించారు.జిల్లాలో పెరుగుతున్న పంటల దిగుబడికి అనుగుణంగా గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాబార్డ్ సహకారంతో సహకార శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదిత గోదాముల నిర్మాణం తో జాబితాపూరు ప్రాంతం జిల్లాలో ధాన్యం నిల్వ కేంద్రం గా మారుతుందని అన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గోదాముల నిర్మాణాన్ని పరిశీలించారు. అదేవిధంగా అంతర్గాం గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో జిల్లా సహకార అధికారి చెరుకు మనోజ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వి. భాస్కర్, ఏడిఏ నాయక్, రూరల్ తాశీల్దార్ హకీం తదితరులు ఉన్నారు.



## గౌడ సోదరులకు కాటమయ్య కిట్లు పంపిణీ

**గజ్వేల్ టౌన్, జూన్ 17,** :
ఈదులు, తాళ్లు ఎక్కి కల్లు గీసే గౌడ సోదరుల కోసం 'కాటమయ్య రక్ష' కిట్లను గజ్వేల్ ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై దీప్తి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం పోషాద్రి అందించారు. బుధవారం గజ్వేల్ నియోజకవర్గం గౌడ సంఘం సోదరులకు 90 కాటమయ్య కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ చెట్టు ఎక్కి కల్లు గీసే క్రమంలో చాలాసార్లు ప్రమాదాల బారిన పడి గీత కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రమాదాల నివారణకు కాటమయ్య కిట్లను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు ఆధునికతను జోడించి సేఫ్టీ కిట్లను ప్రభుత్వం తయారు చేసి అందిస్తుందని విన్నవించారు. గీత కార్మికులు సులువుగా తాటి చెట్లు ఎక్కేలా ఈ కిట్లను రూపొందించారు అని చెప్పారు. ప్రమాదవశాత్తు తాటి చెట్ల మీద నుంచి కింద పడకుండా ఈ పరికరాల్లో అత్యాధునిక టెక్నాలజీని వినియోగించారు అని వ్యాఖ్యానించారు. ఒక్కో కిట్‌లో మొత్తం 6 పరికరాలు ఉంటాయి అని తాడు, క్లిప్పులు, హ్యాండిల్స్, స్లింగ్ బ్యాగ్, లెగ్ లూప్ వంటివన్నీ వేర్వేరుగా ఉంటాయి అని వివరించారు. ప్రస్తుతం గీత కార్మికులు ఉపయోగిస్తున్న సాంప్రదాయ కిట్ల తరహాలోనే ఈ పరికరాలు ఉంటాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్సై వినయ్ కుమార్, పోలీస్ సిబ్బంది, గౌడ్ సంఘం సభ్యులు, నాచారం గౌడ్ సంఘం సొసైటీ అధ్యక్షుడు చింతల సంతోష్ గౌడ్, నాగరాజ్ గౌడ్, వి లింగం , శ్రీధర్, రాజయ్య, అంజయ్య, శ్రీనివాస్, ప్రసాద్ యాదగిరి, మండల గౌడ్ సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడకం తగ్గించాలి

**తూప్రాన్, జూన్ 17,** :
మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడకం తగ్గించాలని జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ తెలిపారు. మండలంలోని గుండ్రెడ్డిపల్లి రైతు వేదికలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి కె దేవకుమార్ హాజరై రైతులకు ప్రకృతి వ్యవసాయం, యూరియా ఆన్ లైన్ బుకింగ్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. నేలలో సేంద్రియ కర్బనం ప్రాముఖ్యత గురించి, దానిని ఎలా పెంచుకోవాలో వివరించారు. రైతులకు వ్యవసాయంలో వస్తున్నటువంటి నూతన సాంకేతిక అంశాలు, యూరియా వాడకం తగ్గించడం, మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాలపై, ఫార్మర్ రిజిస్ట్రేషన్ అవశ్యకత గురించి, పంటల మార్పిడి వంటి అంశాలపై విస్తృతంగా రైతులకు అవగాహన కల్పించారు. అధిక ఎరువులు వాడకం వలన భూసారం నశిస్తుందని అన్నారు. మీకు ఏ సహాయ సహకారం కావాలన్న వ్యవసాయ అధికారులను సంప్రదించి వారు చెప్పిన ప్రకారం వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గంగ మల్లు, ఏడిఏ వినయ్ విన్సెంట్, ఏవో యాదగిరి, వందన, ఏఈవో లక్ష్మీ, గుండ్రెడ్డి పల్లి క్లస్టర్ పరిధిలోని సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.



## మంచినీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు వేగవంతం చేయాలి


- **నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి హన్మంత్ రెడ్డి..**




**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 17,** :
కుత్బుల్లాపూర్‌లో మంచినీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు వేగవంతం చేయాలని బుధవారం కొలన్ హన్మంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మంచినీటి సమస్యల పరిష్కారం కోసం ఆయన స్థానిక నాయకులతో కలిసి వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను ఎండీ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు సానుకూలంగా స్పందించినట్లు హన్మంత్ రెడ్డి తెలిపారు. అనంతరం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, గత 15 సంవత్సరాలలో జరగని అభివృద్ధి ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కుత్బుల్లాపూర్ ప్రజలు నీటి కొరతతో ఇబ్బందులు పడకుండా చూడటం తమ బాధ్యత అని, రాబోయే ఏడాది కాలంలో నియోజకవర్గంలో ఎలాంటి మంచినీటి సమస్య లేకుండా చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి కాలనీకి తగినంత తాగునీటి సరఫరా అందేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు.

# తెలుగు భాషకు 'వేదం' ఎనలేని సేవ

## నేడు వేదం వెంకట రాయ శాస్త్రి వర్ధంతి




పందొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్ధమున భారత దేశమంతటా అన్ని భాషలలో నూతన వికాసానికి తెర లేచింది. పాశ్చాత్య నాగరికత, అంగ్ల విద్య ప్రభావాలు ప్రజల వేష భాషలపై అనూహ్య ప్రభావాలు చూపా యి. ఇందుకు తెలుగు భాష, ప్రజలకు మినహాయింపు ఏమీ లేకుండే. ఆ సంధి కాలంలో వేంకటరాయ శాస్త్రి ఆగమనము ఆంధ్ర వాఙ్మయమున క్రొత్త యుగానికి సూచిక అయింది. వేదం వెంకట రాయ శాస్త్రి అంటే ఒక ప్రాచీన పండితుడిని తప్ప, అయన గొప్పతనం గురించి, ఆయన తెలుగు భాషకు చేసిన అమూల్య, అపూర్వ సేవల గురించి, అయన చూపిన నూతన మార్గాల గురించి నేటి తరంలో చాలా మందికి తెలియదు. కనీసం శాస్త్రి ఏమి రచనలు చేశారో కూడా నేటి సాహిత్యాభిమానులకు తెలియదు. గద్య పద్య నాటక విమర్శకాది విషయములలో శాస్త్రి చూపిన మార్గములు అనేకాలు. నాటి కాలంలో శాస్త్రి గ్రంథములు విమర్శకు గురి అయినట్లు ఆధునికులలో ఎవ్వరి గ్రంథాలు కాలేదన్నది వాస్తవం. సుప్రసిద్ధ పండితుడు, కవి, విమర్శకుడు, నాటకకర్త అయిన వేదం వేంకటరాయ శాస్త్రి... వేంకట రమణశాస్త్రి, లక్ష్మమ్మ దంపతులకు డిసెంబర్ 21, 1853న చెన్నైలో జన్మించారు. 1886లో మద్రాసు క్రైస్తవ కళాశాలలో సంస్కృత పండిత పదవిని 25 సంవత్సరాలు సమర్థ వంతంగా నిర్వహించారు. 1887లో బి.ఎ. పరీక్షలలో ఆంగ్లం, సంస్కృతం లలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణుడయ్యారు.

పరవస్తు చిన్నయసూరికి సహపాఠు లైన, సంస్కృతాంధ్రములలో గొప్ప పండితులు అయిన తండ్రి వేంకటరమణ శాస్త్రి ప్రభావం వేంకట రాయ శాస్త్రి పై పడింది. దాని ప్రభావం వ్యవహార భాషా సాంప్రదాయం అనుసరణకు ప్రేరణ అయింది. 1899లో తెలుగు భాషాభిమాని నాటక సమాజాన్ని స్థాపించారు. ఈ సంస్థలో వెంకటరాయ శాస్త్రి వ్రాసిన నాటకాలని ప్రదర్శించే వారు. ఆయన మూల నాటకాలలో 1897లో వ్రాసిన ప్రతాపరుద్రీయ నాటకం, 1901లో వ్రాసిన ఉషా నాటకం ప్రముఖమైనవి. అనేక సంస్కృత నాటకాలను తెనుగించారు. 1916లో సూర్యారాయాంధ్ర నిఘంటువుకు ప్రధాన సంపాదకుడుగా కొంతకాలం పనిచేశారు. అముక్త మాల్యద, శృంగార నైషధ తదితర వ్యాఖ్యలు శాస్త్రి పాండిత్యానికి నిలువుటద్దాలు. ఆముక్త మాల్యద వ్యాఖ్య శతాధిక వసంతాలను చూసింది. 24-6-1920 నాడు ప్రారంభించి 20-10-1920 నాటికి పూర్తి చేసినట్లు ఆయనే తన జీవిత చరిత్రలో సుస్పష్టంగా చెప్పు కున్నారు. ఆముక్తమాల్యద - సంజీవినీ వ్యాఖ్య, భోజ చరిత్రము, శ్రీకృష్ణ దేవరాయ, విజయము-నాటకము, కథా సరిత్సాగరము పలు భాగాలు, దశకుమార చరితం, శతక వాఙ్మయ చరిత్ర - ప్రథమ సంపుటం, చరిత్ర రచన - ప్రథమ భాగం, తెనుగు లఘు వ్యాకరణము, వ్యామోహము తదితరాలు అయన ప్రముఖ రచనలు. నాగానందం, బొబ్బిలి యుద్ధం, ఉత్తరరామ చరిత, ఆంధ్ర విక్రమోర్వశీయ, ప్రతాపరుద్రీయ, ఉషా నాటకము ప్రియదర్శికాది నాటకములు, అమర కావ్యం, ఆంధ్ర హితోపదేశము - చంపువు, శ్రీ శారదా కాంచిక, ఆంధ్ర బిల్హణీయము, విక్రమార్క చరిత్రము, కావ్యాలంకార చూడామణి, మేఘ సందేశం వ్యాఖ్యానం, ఉదయన చరిత్రము, భరతాభారత రూపక మర్యాదలు, తిక్కన సోమయాజి విజయము, ఆంధ్రవ్యాకరణ సర్వస్వ తత్త్వము, ఆంధ్ర భాషా సర్వస్వ నియమ కతిపయములు, ఆంధ్ర సాహిత్య దర్పణము, విమర్శ వినోదము, ఆంధ్ర ప్రసన్నరాఘవ విమర్శనము, తానాషా అక్కన్న మాదన్నలు, ఆంధ్ర రత్నావళీ నాటిక, సారంగధర చరిత్రము, పుష్పబాణ విలాసం, రసమంజరీ, కుమార సంభవము వ్యాఖ్య, ఉదయన చరిత్రము, పంచ తంత్రం, ఆంధ్ర దశకుమార చరిత్రము తదితర రచనలు గావించారు.

1920లో ఆంధ్ర మహా సభ చేత 'మహోపాధ్యాయ' బిరుదు పొందారు. 1922లో ద్వారక పీఠ శంకరభగవత్పాదులచేత 'సర్వ తంత్ర స్వతంత్ర', 'మహా మహోపాధ్యాయ', 'విద్యా దాన వ్రత మహోదధి' అనే సత్కారాలు పొందారు. 1927లో ఆంధ్ర విశ్వకళా పరిషత్తు చేత 'కళా ప్రపూర్ణ' గౌరవంతో సన్మానించ బడ్డారు. 1958లో కుమార సంభవ ప్రబంధకర్త నన్నెచోడుని కవిత్వంపై వీరు రాసిన 'నన్నెచోడుని కవిత్వము' అనే విమర్శనా గ్రంథానికి 'ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి' బహుమతి లభించింది.
వెంకటరాయ శాస్త్రి 1929, జూన్ 18న మద్రాసులో మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ప్రకృతితో మమేకమయ్యే మధుర వేళ

## ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు ప్రపంచానికి పిలుపు

### నేడు అంతర్జాతీయ విహార దినోత్సవం

ఆధునిక జీవనశైలిలో యాంత్రికత పెరుగుతున్న కొద్దీ ప్రకృతికి, కుటుంబ బంధాలకు మనిషి దూరవవుతున్నాడు. అలాంటి పరిస్థితుల్లో ప్రకృతి మధ్య సేదతీరుతూ, కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఆనంద క్షణాలను పంచుకోవాలనే సందేశంతో ప్రతి ఏడాది జూన్ 18న అంతర్జాతీయ విహార దినోత్సవం జరుపుకుంటారు. ఇది కేవలం ఒక వేడుక మాత్రమే కాదు.. ప్రకృతితో మానవుడి అనుబంధాన్ని పునరుద్ధరించే ప్రత్యేక సందర్భం.

విహారం లేదా పిక్నిక్ అనే సంప్రదాయం 19వ శతాబ్దంలో పాశ్చాత్య దేశాల్లో విస్తృతంగా ప్రాచుర్యం పొందింది. వేసవి కాలంలో కుటుంబాలు, స్నేహితులు కలిసి పచ్చిక బయళ్లు, ఉద్యానవనాలు, నదీతీరాలు వంటి ప్రదేశాల్లో భోజనం చేస్తూ గడిపే ఆనవాయితీ క్రమంగా ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. నేడు ఇది విశ్రాంతి, ఉల్లాసం, ఆరోగ్యకర జీవన విధానానికి ప్రతీకగా నిలిచింది. నిత్యజీవితంలో ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళనల నుంచి ఉపశమనం పొందేందుకు విహారం ఎంతో ఉపయోగపడుతుంది. ప్రకృతి ఒడిలో గడిపే కొద్ది గంటల సమయం మానసిక ప్రశాంతతను అందించడమే కాకుండా శారీరక ఆరోగ్యాన్నీ మెరుగుపరుస్తుంది. పచ్చని చెట్లు, స్వచ్ఛమైన గాలి, పక్షుల కిలకిలారావాలు మనసుకు ఉల్లాసాన్ని పంచుతాయి. కుటుంబ సభ్యులతో కలిసి గడిపే సమయం బంధాలను మరింత బలోపేతం చేస్తుంది. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని చాలామంది పార్కులు, సరస్సులు, కొండ ప్రాంతాలు, జలపాతాలు వంటి ప్రకృతి అందాలు నిండిన ప్రదేశాలను సందర్శిస్తారు. ఇంట్లో తయారుచేసిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకెళ్లి ప్రకృతి మధ్య భోజనం చేయడం, ఆటలు ఆడటం, పాటలు పాడటం, పుస్తకాలు చదవడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా పిల్లలకు ప్రకృతి విలువలను తెలియజేసే



అవకాశంగా ఈ రోజును వినియోగించుకోవచ్చు. పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని కూడా ఈ దినోత్సవం ముందుకు తీసుకువస్తుంది. విహారయాత్రలకు వెళ్లే సమయంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, చెట్లను నాటడం వంటి చర్యల ద్వారా ప్రకృతిపట్ల బాధ్యతను చాటుకోవాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. సాంకేతిక ప్రపంచంలో మునిగిపోయిన ఆధునిక మానవుడికి ప్రకృతి ఒడిలో గడిపే కొన్ని గంటలు కొత్త ఉత్సాహాన్ని, స్ఫూర్తిని అందిస్తాయి. మనిషి, ప్రకృతి, కుటుంబం, సమాజం మధ్య ఉన్న అనుబంధాలను మరింత బలపరిచే ఈ అంతర్జాతీయ విహార దినోత్సవం ప్రతి ఒక్కరికి జీవితాన్ని మరింత ఆనందమయం చేసుకునే అవకాశాన్ని అందిస్తోంది.

**ప్రకృతిని ప్రేమిద్దాం... కుటుంబంతో సమయం గడుపుదాం... విహార దినోత్సవాన్ని సార్థకం చేసుకుందాం.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# గండవరం జీవితం నాటక రంగానికి అంకితం

## నేడు గండవరం సుబ్బరామిరెడ్డి వర్ధంతి

గండవరం సుబ్బరామిరెడ్డి (1937 - జూన్ 18, 2017) ప్రముఖ నాటక రచయిత, నటులు, దర్శకులు, నిర్వహకులు, విమర్శకులు. ఆయన 1937 సంవత్సరంలో జానకమ్మ, బలరామిరెడ్డి దంపతులకు నెల్లూరు జిల్లా లోని గూడూరులో జన్మించారు. ఉన్నత పాఠశాల చదువు గూడూరులో పూర్తిచేసి, నెల్లూరు లోని వి.ఆర్.కాలేజీలో బి.ఏ పట్టభద్రులయ్యారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సహాయ కార్యదర్శిగా పనిచేసి, 1995లో పదవీ విరమణ చేశారు.

1952నుండే రంగస్థలంతో అనుబంధం ఉంది. విద్యార్థిగా ఉన్నప్పుడే మమత అనే నాటిక రాసి స్కూలు వార్షికోత్సవాలలో ప్రదర్శింప చేసారు. నెల్లూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటక పోటీల్లో ఏది మార్గం అనే నాటిక రాసి ప్రదర్శింపచేసి, ఉత్తమ నిర్వహణ బహుమతి పొందారు. నాటక రచన, పాత్ర పోషణ, విమర్శ, పరిశోధన వీరి ప్రత్యేకతలు. మన ఊరు, శిఖరం కూలింది, వెంటాడే నీడలు అనే రంగస్థల నాటికలు, నీరు పల్లమెరుగు, చీమలు పెట్టిన పుట్టలు, నయనతార అనే రేడియో నాటకాలు రాశారు. వెలుగుఅపూలు అనే కార్యక్రమానికి 105 ఎపిసోడ్‌ల స్క్రిప్ట్ రాశారు. నాటకరంగం పై సుమారు 300 వ్యాసాలు వివిధ పత్రికలకు రాశారు. తెలుగు నాటకరంగం పైన, అటు పాశ్చాత్య నాటకరంగం పైన పరిశోధన చేసి ఆధునిక తెలుగు నాటకం అనే పుస్తకంగా



1860నుంచి 1985 వరకు వచ్చిన మార్పులు రాశారు. గ్లింప్సెస్ ఆఫ్ తెలుగు డ్రామా అనే పేరుతో ఇంగ్లీషులో తెలుగు నాటక రచయితల రచనలపైన గ్రంథం రచించారు. మూడు ప్రసిద్ధ నాటకాలు అయిన వరవిక్రయం, నిజం, గయోపాఖ్యానం పైన విమర్శనాత్మక గ్రంథాలు రాశారు. ఆంధ్రదేశంలోని తెలంగాణ, ఆంధ్రా రాయలసీమ జిల్లాలలోనే కాక రాష్ట్రేతర పరిషత్తుల్లో కూడా నిర్వహించిన ఎన్నో నాటక పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. అనేక ప్రతిష్ఠాత్మక పరిషత్ నాటకాలకు 77సార్లు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. అమెరికాలోని తెలుగు సంస్థ ఆటావారు 1998లో నిర్వహించిన ప్రపంచ నాటక రచన పోటీలకు కూడా న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. సుమారు మూడుసార్లు అమెరికాలో పర్యటించి అక్కడి రంగస్థల విశేషాలను గమనించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన గ్రంథానికి సంగ్రహ సంపాదకులుగా వ్యవహరించి నాటక విజ్ఞాన సర్వస్వం అనే గ్రంథాన్నినాటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ చేతుల మీదుగా ఆవిష్కరింప చేశారు. ఉత్తమ సాహితీ విమర్శకునిగా ఆరాధనా జవ్వాది ట్రస్ట్, లలిత కళాసమితి వారి ఉగాది పురస్కారం, విశేష నాటక రంగ కృషివలుడుగా నార్ల ఫౌండేషన్‌వారి పురస్కారం, అభినయ స్టేజ్ అవార్డ్
తంగిరాల కృష్ణప్రసాద్ స్మారక అవార్డులు పొందారు. జీవన సాఫల్య పురస్కారం (ప్రగతి కళామండలి, సత్తెనపల్లి- త్యాగరాయ గానసభ, హైదరాబాదు, 8 ఆగస్టు 2016 తదితర అవార్డులు అందు కున్నారు. గూడూరులోని సాంస్కృతిక సమ్మేళనం, కాళిదాసు కళానికేతన్ లకు వ్యవస్థాపక సభ్యులుగా ఉంటూ సుమారు 50 సంవత్సరాలపాటు రాష్ట్రస్థాయి నాటక పోటీలు, సంగీత పోటీలు నిర్వహించారు.
ఆయన 2017, జూన్ 18న హైదరాబాద్ లో మరణించారు

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# మోగనున్న పెళ్లి బాజాల సందడి

- నేటి నుంచి శుభముహూర్తాలు:
- గత నెలన్నర రోజులుగా అధిక జ్యేష్ఠ మాసం వల్ల నిలిచిపోయిన శుభకార్యాల హడావుడి
- జూన్ 18 నుంచి జూలై 9 వరకు మాత్రమే పరిమిత సమయం.. ఆ తర్వాత మళ్లీ ఆషాఢం బ్రేక్
- పశ్చిమాసియా యుద్ధ ప్రభావం.. బంగారం, రవాణా, క్యాటరింగ్ ధరలు పెరగడంతో తల్లిదండ్రులపై భారీ భారం

తెలుగు లోగిళ్లల్లో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పెళ్లి బాజాల సందడి ఎట్టకేలకు మొదలైంది. గత నెలన్నర రోజులుగా అధిక జ్యేష్ఠ మాసాల వల్ల ఆగిపోయిన శుభకార్యాల హడావుడి ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. జూన్ 15 నుంచి నిజ జ్యేష్ఠ మాసం ప్రవేశించడంతో పెళ్లిళ్ల హడావుడి షురూ అయ్యింది. అయితే, ఈసారి జూన్ 18 నుంచి జూలై 9 వరకు మాత్రమే చాలా పరిమితంగా శుభ ముహూర్తాలు అందుబాటులో ఉన్నాయి. ఆ తర్వాత మళ్లీ జూలై 15 నుంచి ఆషాఢమాసం, గురుమూఢం మొదలుకానుండటంతో ఆగస్టు 15 వరకు పెళ్లిళ్లకు బ్రేక్ పడనుంది. తిరిగి శ్రావణ మాసం వస్తేనే గానీ మళ్లీ శుభకార్యాలు జరిగే అవకాశం లేదు. ఈ కొద్దిపాటి కాస్త గ్యాప్‌లోనే పెళ్లిళ్లు కానిచ్చేయాలని అందరూ ఒకేసారి ప్రయత్నిస్తుండటంతో మార్కెట్లో విపరీతమైన పోటీ ఏర్పడింది. సమయం చాలా తక్కువగా ఉండటాన్ని ఆసరాగా చేసుకుని పురోహితులు, ఫంక్షన్ హాళ్ల యజమానులు, డెకరేటర్లు అందరూ డిమాండ్‌ను బట్టి రేట్లు విపరీతంగా పెంచేస్తున్నారు.

### యుద్ధ వాతావరణం, పసిడి ధరల మోత.. పెళ్లి పెద్దలకు బడ్జెట్ సవాల్

ఈ పెళ్లిళ్ల సంతోషాల వెనుక వధూవరుల తల్లిదండ్రులకు ఒక పెద్ద బడ్జెట్ సవాల్ ఎదురవుతోంది. ప్రస్తుతం చేతిలో ఉన్న సమయం చాలా తక్కువగా ఉండటంతో పాటు, అంతర్జాతీయంగా అమెరికా మరియు ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల ప్రభావం తెలుగు లోగిళ్ల పెళ్లిళ్లపై గట్టిగానే పడుతోంది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం వల్ల అంతర్జాతీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు, వాహనాల కిరాయిలు భారీగా పెరిగాయి. అలాగే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరల పెరుగుదలను సాకుగా చూపిస్తూ క్యాటరింగ్ నిర్వాహకులు కూడా ప్లేటు ధరలను పెంచేశారు. సమాజంలో హోదా కోసం కనీసం పాతిక రకాల వంటకాలతో విందు వడ్డించడం రివాజుగా మారడంతో, ఇప్పుడు ప్లేటు ధర కనీసం రూ. 500 దాటుతోంది.
వీటన్నింటికీ మించి మధ్యతరగతి, పేద కుటుంబాలకు పెళ్లిలో అత్యంత కీలకమైన బంగారం కొనుగోలు కొండంత భారంగా మారింది. సాంప్రదాయం ప్రకారం మంగళసూత్రాలు, గొలుసు, కమ్మలు, గాజులు వంటి కనీస అవసరాల కోసమే కచ్చితంగా 5 నుండి 6 తులాలు కొనాల్సి వస్తోంది. ఏడాది క్రితంతో పోలిస్తే పసిడి ధరలు విపరీతంగా పెరగడం వల్ల, కేవలం



బంగారం కొనుగోలుకే ఇప్పుడు రూ. 7 నుండి 8 లక్షలు ఖర్చవుతోంది. ఇక బంగారం ఖర్చు కాకుండా, కేవలం మండపం అద్దె, డెకరేషన్, విందు భోజనాలు, ప్రయాణాలకే అదనంగా మరో రూ. 5 నుంచి 10 లక్షల వరకు ఖర్చవుతోంది. అంతర్జాతీయ పరిస్థితుల ముందటి కాలంతో పోలిస్తే, ప్రస్తుతం ఒక్కో పెళ్లికి సగటున రూ. 5 లక్షల వరకు అదనపు భారం పడుతోంది. మొత్తానికి, ఇళ్ల ముందు పెళ్లి బాజాలు మోగుతున్నా, ఖర్చుల మోత చూసి వధూవరుల తల్లిదండ్రులు మాత్రం తలలు పట్టుకుంటున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

చురకలు






# పసిడి, వెండి ధరల్లో స్వల్ప తగ్గుదల

**హైదరాబాద్, జూన్ 17 :** అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావంతో దేశీయంగా బంగారం, వెండి ధరల్లో స్వల్ప తగ్గుదల నమోదైంది. ముడి చమురు ధరలు తగ్గడం, అమెరికా డాలర్ బలపడడం వంటి పరిణామాల కారణంగా పసిడి ధరలు క్రమంగా దిగివస్తున్నాయి. దీంతో బుధవారం దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,51,100గా నమోదైంది. అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ. 1,38,500గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,51,250 కాగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,38,650గా నమోదైంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. కిలో వెండి ధరపై రూ. 2,650 మేర తగ్గుదల కనిపించింది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ నగరాల్లో కిలో వెండి ధర రూ. 2,75,000గా ఉంది. ఢిల్లీలో కిలో వెండి ధర రూ. 2,65,000గా నమోదైంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ. 2,75,000 కాగా, బెంగళూరులో రూ. 2,65,000గా ఉంది. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక రాజకీయ పరిణామాలు, డాలర్ మారకం విలువల ప్రభావంతో బంగారం, వెండి ధరలు రోజువారీగా మారుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. పెట్టుబడిదారులు కొనుగోళ్లకు ముందు తాజా ధరలను పరిశీలించాలని సూచిస్తున్నారు.

# టెలిగ్రామ్‌పై ఆంక్షలు

## దురోవ్ అభ్యంతరం

**న్యూఢిల్లీ, జూన్ 17 :** దేశంలో టెలిగ్రామ్ సేవలపై విధించిన తాత్కాలిక ఆంక్షలపై ఆ సంస్థ వ్యవస్థాపకుడు పావెల్ దురోవ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టే పేరుతో కోట్లాది మంది సాధారణ వినియోగదారులను ఇబ్బందులకు గురిచేయడం సరైన విధానం కాదని ఆయన పేర్కొన్నారు. సమస్యకు కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సిందిపోయి మొత్తం వేదికను నిలిపివేయడం సమంజసం కాదన్నారు. జూన్ 21న జరగనున్న నీట్-యూజీ 2026 పునఃపరీక్ష నేపథ్యంలో ప్రశ్నాపత్రాల లీకేజీలు, అక్రమ కార్యకలాపాలను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాతీయ పరీక్షల సంస్థ సిఫార్సు మేరకు సమాచార సాంకేతిక చట్టంలోని నిబంధనల ప్రకారం టెలిగ్రామ్ సేవలను జూన్ 22 వరకు తాత్కాలికంగా నిలిపివేసింది. పరీక్షల విశ్వసనీయతను కాపాడడం, అక్రమ మార్గాల్లో ప్రశ్నాపత్రాల వ్యాప్తిని అడ్డుకోవడమే ఈ నిర్ణయానికి కారణమని అధికారులు తెలిపారు. ఇప్పటికే అనుమానాస్పద ఛానళ్లు, గ్రూపులపై టెలిగ్రామ్ చర్యలు తీసుకుందని పావెల్ దురోవ్ వెల్లడించారు. లీకేజీలకు సంబంధించిన సమాచారాన్ని పంచుతున్న అనేక వేదికలను తొలగించామని, సమస్య పరిష్కారానికి సహకరిస్తున్నామని తెలిపారు. అసలు నేరస్తులను గుర్తించి చర్యలు తీసుకోవడం బదులు మొత్తం సేవలను నిలిపివేయడం వల్ల సాధారణ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో భారతీయ వినియోగదారుల కోసం సందేశాల సవరణ సౌకర్యాన్ని కూడా తాత్కాలికంగా నిలిపివేయాలని ప్రభుత్వం సూచించింది. పరీక్షల అనంతరం పాత సందేశాలను మార్చి తప్పుడు ఆధారాలు సృష్టించే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. దీనిపై స్పందించిన దురోవ్, సవరించిన సందేశాలపై స్పష్టమైన గుర్తింపు కనిపించేలా సాంకేతిక మార్పులు చేపడుతున్నామని, వ్యవస్థను మరింత పారదర్శకంగా రూపొందిస్తున్నామని చెప్పారు. టెలిగ్రామ్ సేవలు నిలిచిపోవడంతో విద్యా సంబంధిత గ్రూపులు, అధ్యయన సామగ్రిపై ఆధారపడే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును రక్షించడం, పరీక్షల నిర్వహణలో పారదర్శకతను కాపాడడం కోసం ఈ చర్యలు అవసరమయ్యాయని అధికారులు స్పష్టం చేశారు. తాత్కాలిక అసౌకర్యం ఉన్నప్పటికీ, ప్రశ్నాపత్రాల లీకేజీలను పూర్తిగా అరికట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.



# స్పేస్‌ఎక్స్ విలువ దూసుకెళ్తుందా?

**హైదరాబాద్, జూన్ 17:** అంతరిక్ష సాంకేతిక రంగంలో అగ్రగామిగా నిలిచిన స్పేస్‌ఎక్స్ సంస్థ మార్కెట్ విలువపై అంతర్జాతీయ ఆర్థిక వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. అయితే స్పేస్‌ఎక్స్ ఇప్పటికే స్టాక్ మార్కెట్‌లో నమోదైందని, ప్రారంభ షేర్ల విక్రయం నిర్వహించిందని వస్తున్న ప్రచారాలపై స్పష్టత అవసరం. ప్రస్తుతం స్పేస్‌ఎక్స్ పబ్లిక్ కంపెనీ కాదు. అందువల్ల షేర్లు సాధారణ స్టాక్ మార్కెట్‌లో కొనుగోలు, విక్రయాలకు అందుబాటులో లేవు. అయినప్పటికీ ప్రైవేట్ పెట్టుబడి లావాదేవీలు, ద్వితీయ మార్కెట్ ఒప్పందాల ఆధారంగా సంస్థ విలువ గణనీయంగా పెరుగుతున్నట్లు అంచనాలు వ్యక్తమవుతున్నాయి. సంస్థ విలువపై వెలువడుతున్న తాజా అంచనాల ప్రకారం స్పేస్‌ఎక్స్ మార్కెట్ విలువ ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరువవుతోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఉపగ్రహ ఆధారిత అంతర్జాల సేవల సంస్థ స్టార్‌లింక్ వేగంగా విస్తరించడం, పునర్వినియోగ రాకెట్ సాంకేతికతలో సాధించిన పురోగతి, అంతరిక్ష ప్రయోగాల్లో పెరుగుతున్న వాణిజ్య అవకాశాలు సంస్థపై పెట్టుబడిదారుల విశ్వాసాన్ని మరింత పెంచుతున్నాయి. ఈ కారణాల వల్లే స్పేస్‌ఎక్స్ ప్రపంచంలోని అత్యంత విలువైన ప్రైవేట్ సంస్థలలో ఒకటిగా కొనసాగుతోంది. అంతరిక్ష ప్రయోగాల వ్యయాన్ని తగ్గించడంలో స్పేస్‌ఎక్స్ కీలక పాత్ర పోషిస్తోంది. ఫాల్కన్ రాకెట్లు, స్టార్‌షిప్ ప్రాజెక్టు, స్టార్‌లింక్ సేవలు సంస్థ భవిష్యత్ ఆదాయ వనరులుగా భావిస్తున్నారు. కృత్రిమ మేధ, అంతరిక్ష సమాచార సేవలు, ఉపగ్రహ కమ్యూనికేషన్ రంగాల్లో విస్తరణ కూడా సంస్థ వృద్ధికి దోహదపడుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆర్థిక రంగం స్పేస్‌ఎక్స్ భవిష్యత్ అడుగులపై ఆసక్తిగా ఎదురుచూస్తోంది. అయితే సంస్థ అధికారికంగా స్టాక్ మార్కెట్‌లో నమోదు కాలేదు కాబట్టి, ఐపీఓ, షేరు ధరల పెరుగుదల, అమెజాన్‌ను మార్కెట్ విలువలో అధిగమించిందనే ప్రచారాలను పెట్టుబడిదారులు జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం స్పేస్‌ఎక్స్ వృద్ధి ప్రైవేట్ పెట్టుబడులు, వ్యాపార విస్తరణ, సాంకేతిక ఆవిష్కరణల ఆధారంగానే కొనసాగుతోంది.

# కొత్త హంగులతో మారుతి కార్లు

## వరుసగా ఫేస్‌లిఫ్ట్ మోడళ్ల విడుదలకు సిద్ధం

**న్యూఢిల్లీ, జూన్ 17 :** దేశీయ వాహన రంగంలో అగ్రస్థానంలో ఉన్న మారుతి సుజుకి సంస్థ రాబోయే కాలంలో తన ప్రముఖ కార్లను సరికొత్త హంగులతో మార్కెట్లోకి తీసుకురావడానికి సిద్ధమవుతోంది. 2027 మార్చి నాటికి పలు నవీకరించిన మోడళ్లను విడుదల చేయాలని సంస్థ ప్రణాళికలు రూపొందించింది. ఇందులో బ్రెజ్జా, ఫ్రాంక్స్, గ్రాండ్ విటారా వంటి ప్రముఖ వాహనాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ వాహనాల పరీక్షా ప్రక్రియ ప్రారంభమైనట్లు సమాచారం. బ్రెజ్జా ఫేస్‌లిఫ్ట్ మోడల్ వచ్చే కొన్ని నెలల్లోనే మార్కెట్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ వాహనంలో బాహ్య రూపకల్పనతో పాటు అంతర్గత భాగంలో కూడా గణనీయమైన మార్పులు చేయనున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇంజిన్‌లతో పాటు కొత్త టర్బో ఇంజిన్, ఆరు వేగాల గేర్‌బాక్స్‌ను అందించే అవకాశం ఉందని ఆటోమొబైల్ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే వాహనంలో సిఎన్‌జీ ట్యాంక్‌ను అడుగు భాగంలో అమర్చడం ద్వారా ప్రయాణికులకు మరింత స్థలాన్ని కల్పించనున్నారు. ఫ్రాంక్స్ ఫేస్‌లిఫ్ట్ మోడల్‌లో అత్యాధునిక భద్రతా సాంకేతికతలను అందించనున్నారు. రాడార్ ఆధారిత డ్రైవర్ సహాయక వ్యవస్థ, స్వయంచాలక అత్యవసర బ్రేకింగ్, వేగ నియంత్రణ వంటి సదుపాయాలు ఉండనున్నాయి. అంతేకాకుండా సంస్థ స్వయంగా అభివృద్ధి చేసిన బలమైన హైబ్రిడ్ వ్యవస్థను ఇందులో ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల ఇంధన వినియోగం గణనీయంగా తగ్గి, అధిక మైలేజీ లభించే అవకాశం ఉంది. గ్రాండ్ విటారా ఫేస్‌లిఫ్ట్ మోడల్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు సంస్థ చర్యలు చేపట్టింది. కొత్త ముందు గ్రిల్, నవీకరించిన బంపర్లు, ఆధునిక అల్లాయ్ చక్రాలతో ఈ వాహనం అందుబాటులోకి రానుంది. అలాగే విద్యుత్ ఆధారిత వెనుక తలుపు, అధునాతన భద్రతా వ్యవస్థలు, మెరుగైన వినోద సదుపాయాలు వంటి ప్రత్యేకతలు ఇందులో ఉండనున్నాయి.




రాబోయే మూడేళ్లలో మొత్తం తొమ్మిది కొత్త మోడళ్లను విడుదల చేయాలని మారుతి సుజుకి లక్ష్యంగా పెట్టుకుంది. వాటిలో ఎక్కువ భాగం క్రీడోపయోగ వాహనాలే ఉండనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే బ్రెజ్జా, ఫ్రాంక్స్, గ్రాండ్ విటారా, బాలెనో నవీకరించిన మోడళ్లను విడుదల చేయడం ద్వారా మార్కెట్లో తన వాటాను మరింత పెంచుకోవాలని సంస్థ భావిస్తోంది. హైబ్రిడ్, సిఎన్‌జీ, అధునాతన భద్రతా సదుపాయాలు, విశాలమైన అంతర్గత స్థలం వంటి అంశాలపై దృష్టి సారిస్తూ మారుతున్న వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా కొత్త వాహనాలను అభివృద్ధి చేస్తోంది. దీంతో రాబోయే కాలంలో వాహన కొనుగోలుదారులకు మరిన్ని ఆధునిక, ఇంధన పొదుపు వాహనాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

## మొదటి ట్రిలియనీర్‌గా

# ఎలన్ మస్క్?

**న్యూయార్క్, జూన్ 17:** ప్రపంచంలోని అత్యంత ధనవంతుల జాబితాలో ఎప్పుడూ అగ్రస్థానంలో ఉండే ప్రముఖ పారిశ్రామికవేత్త ఎలన్ మస్క్ మరోసారి అంతర్జాతీయ వ్యాపార వర్గాల్లో చర్చనీయాంశంగా మారారు. అంతరిక్ష పరిశోధన, విద్యుత్ వాహనాలు, కృత్రిమ మేధ రంగాల్లో విస్తృత పెట్టుబడులు పెట్టిన ఆయన సంపద కొత్త గరిష్ఠ స్థాయికి చేరుకున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో మానవ చరిత్రలోనే తొలి ట్రిలియన్ డాలర్ల వ్యక్తిగత ఆస్తి కలిగిన వ్యక్తిగా ఆయన నిలిచారనే ప్రచారం ప్రపంచవ్యాప్తంగా దృష్టిని ఆకర్షిస్తోంది.

ఇటీవల ఎలన్ మస్క్‌కు చెందిన అంతరిక్ష సాంకేతిక సంస్థ స్పేస్‌ఎక్స్ అమెరికా స్టాక్ మార్కెట్లో ప్రవేశించిన తర్వాత పెట్టుబడిదారుల నుంచి భారీ స్పందన లభించినట్లు ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు. మార్కెట్లో నమోదైన షేర్లకు భారీ డిమాండ్ ఏర్పడటంతో కంపెనీ విలువ గణనీయంగా పెరిగింది. అంతరిక్ష ప్రయోగాలు, ఉపగ్రహ ఆధారిత




సమాచార సేవలు, కృత్రిమ మేధ ప్రాజెక్టుల కారణంగా స్పేస్‌ఎక్స్ భవిష్యత్ అవకాశాలపై పెట్టుబడిదారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. స్పేస్‌ఎక్స్‌లో మస్క్‌కు ఉన్న వాటాలతో పాటు విద్యుత్ వాహనాల తయారీ సంస్థ టెస్లాలో ఆయనకు ఉన్న వాటాల విలువ కూడా భారీగా పెరిగింది. ఈ రెండు సంస్థల మార్కెట్ విలువలు పెరగడంతో ఆయన వ్యక్తిగత సంపద చారిత్రక స్థాయికి చేరుకున్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. ఆర్థిక రంగ నిపుణుల లెక్కల ప్రకారం ఆయన మొత్తం ఆస్తి విలువ ట్రిలియన్ డాలర్లకు పైగా చేరినట్లు ప్రచారం జరుగుతోంది. ఒక ట్రిలియన్ డాలర్లు అనే మొత్తం సాధారణంగా ఊహించలేనంత భారీ స్థాయి సంపదగా భావిస్తారు. ప్రపంచంలోని అనేక దేశాల వార్షిక స్థూల దేశీయోత్పత్తికంటే కూడా ఈ మొత్తం ఎక్కువగా ఉండటం విశేషం. అందుకే మస్క్ సంపద పెరుగుదల ప్రపంచ ఆర్థిక రంగంలో ప్రత్యేక చర్చకు దారితీసింది. అయితే మార్కెట్ విలువలు ఎప్పటికప్పుడు మారుతూ ఉండటంతో సంపదకు సంబంధించిన గణాంకాలు కూడా మారే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు గుర్తు చేస్తున్నారు. అయినప్పటికీ అంతరిక్షం, విద్యుత్ వాహనాలు, కృత్రిమ మేధ వంటి భవిష్యత్ రంగాల్లో చేసిన పెట్టుబడుల వల్ల ఎలన్ మస్క్ ప్రపంచ వ్యాపార చరిత్రలో అరుదైన స్థానాన్ని సంపాదించారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రూ.25 వేల కోట్లకు పిజ్జా హట్ విక్రయం

**న్యూయార్క్, జూన్ 17 :** ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పిజ్జా హట్ రెస్టారెంట్ శ్రేణి యాజమాన్యంలో కీలక మార్పు చోటుచేసుకోనుంది. పిజ్జా హట్‌తో పాటు ప్రముఖ ఆహార బ్రాండ్లను నిర్వహిస్తున్న యమ్ బ్రాండ్స్ సంస్థ, పిజ్జా హట్ వ్యాపారాన్ని మొత్తం 2.7 బిలియన్ డాలర్లకు, భారత కరెన్సీలో సుమారు రూ. 25 వేల కోట్లకు విక్రయిస్తున్నట్లు ప్రకటించింది. ఒప్పందం ప్రకారం, చైనా మినహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పిజ్జా హట్ కార్యకలాపాలను లాంగ్‌రేంజ్ క్యాపిటల్ అనే ప్రైవేట్ పెట్టుబడి సంస్థ 1.5 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేయనుంది. మరోవైపు, చైనాలో ఉన్న 4,375 పిజ్జా హట్ రెస్టారెంట్లను యమ్ చైనా హోల్డింగ్స్ సంస్థ 1.2 బిలియన్ డాలర్లకు స్వాధీనం చేసుకోనుంది. గత కొన్నేళ్లుగా పిజ్జా హట్ వ్యాపారం అనేక దేశాల్లో ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ముడి పదార్థాల ధరల పెరుగుదల, వినియోగదారుల ఆహారపు అలవాట్లలో మార్పులు సంస్థ ఆదాయంపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా అమెరికా మార్కెట్లో అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో వ్యాపార పునర్వ్యవస్థీకరణ అవసరమైంది. అయితే చైనా మార్కెట్లో మాత్రం పిజ్జా హట్ గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. స్థానిక వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ప్రత్యేక వంటకాలను అందించడం, కొత్త తరహా రెస్టారెంట్ నమూనాలను ప్రవేశపెట్టడం ద్వారా అక్కడి వ్యాపారం బలంగా కొనసాగుతోంది. ఈ కారణంగానే చైనా కార్యకలాపాలను




ప్రత్యేకంగా కొనుగోలు చేసేందుకు యమ్ చైనా హోల్డింగ్స్ ముందుకు వచ్చినట్లు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ విక్రయ ఒప్పందం పూర్తయిన తర్వాత కూడా పిజ్జా హట్ బ్రాండ్ ప్రపంచవ్యాప్తంగా తన సేవలను కొనసాగించనుంది. అయితే కొత్త యాజమాన్యం ఆధ్వర్యంలో వ్యాపార వ్యూహాలు, విస్తరణ ప్రణాళికల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



చురకలు





# మెస్సీ ఫౌల్‌పై వివాదం

**బ్యూనస్ ఐరెస్, జూన్ 17:** అర్జెంటీనా, అల్జీరియా జట్ల మధ్య జరిగిన అంతర్జాతీయ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ చేసిన ఫౌల్ తీవ్ర వివాదానికి దారితీసింది. మ్యాచ్ సందర్భంగా అల్జీరియా ఆటగాడిపై మెస్సీ వెనుక నుంచి చేసిన కఠిన టాకిల్‌పై అభిమానులు, విశ్లేషకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో ప్రత్యర్థి ఆటగాడు నొప్పితో మైదానంలో పడిపోగా, అది నేరుగా ఎరుపు కార్డు ఇవ్వాల్సిన స్థాయి ఫౌల్ అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఘటనను వీడియో సహాయ రిఫరీ వ్యవస్థ ద్వారా పరిశీలించినప్పటికీ, మ్యాచ్ రిఫరీ ఎలాంటి కార్డు చూపించకపోవడం వివాదానికి మరింత ఊతమిచ్చింది. సామాజిక మాధ్యమాల్లో అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తూ, ఒకే రకమైన ఫౌల్‌కు ఇతర ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటే, మెస్సీ విషయంలో ఎందుకు మినహాయింపు ఇచ్చారంటూ ప్రశ్నిస్తున్నారు. రిఫరీ నిర్ణయంపై క్రీడా వర్గాల్లో కూడా చర్చ సాగుతోంది. అయితే ఈ వివాదం మధ్యే మెస్సీ తన ఆటతో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించాడు. అల్జీరియాపై జరిగిన మ్యాచ్‌లో మూడు గోల్స్ సాధించి హ్యాట్రిక్ నమోదు చేశాడు. మెస్సీ అద్భుత ప్రదర్శనతో అర్జెంటీనా జట్టు 3-0 తేడాతో ఘన విజయం సాధించింది. మ్యాచ్ మొత్తం మీద ఆధిపత్యం ప్రదర్శించిన అర్జెంటీనా, ప్రత్యర్థికి పెద్దగా అవకాశాలు ఇవ్వకుండా విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్‌తో మెస్సీ తన ఖాతాలో మరో చారిత్రక ఘనతను కూడా నమోదు చేసుకున్నాడు. ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక గోల్స్ సాధించిన ఆటగాడిగా నిలిచిన జర్మనీ మాజీ ఫుట్‌బాలర్ మిరోస్లావ్ క్లోజ్ సాధించిన 16 గోల్స్ రికార్డును మెస్సీ సమం చేసినట్లు క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా గుర్తింపు పొందిన మెస్సీ, మరో అరుదైన మైలురాయిని చేరుకోవడంతో అభిమానులు సంబరాలు జరుపుకుంటున్నారు. ఒకవైపు రిఫరీ నిర్ణయంపై వివాదం కొనసాగుతుండగా, మరోవైపు మెస్సీ రికార్డు ప్రదర్శన ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈ మ్యాచ్‌కు సంబంధించిన వీడియోలు, ఫౌల్ ఘటన, హ్యాట్రిక్ గోల్స్ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి.



# ఎంబాప్పే ద్విగోల్ మెరుపు

**ఈస్ట్ రూథర్‌ఫోర్డ్, జూన్ 17:** ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఫ్రాన్స్ కెప్టెన్ కైలియన్ ఎంబాప్పే మరోసారి తన అసాధారణ ప్రతిభను చాటుకున్నాడు. సెనెగల్‌తో జరిగిన మ్యాచ్‌లో రెండు గోల్స్ సాధించి జట్టును 3-1 తేడాతో విజయతీరాలకు చేర్చాడు. ఈ ప్రదర్శనతో ప్రపంచకప్ చరిత్రలో ఫ్రాన్స్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా కొత్త రికార్డు నెలకొల్పాడు. మూడో ప్రపంచకప్ ఆడుతున్న ఎంబాప్పే ఇప్పటివరకు టోర్నీ చరిత్రలో 14 గోల్స్ నమోదు చేశాడు. ప్రపంచకప్‌లలో అత్యధిక గోల్స్ సాధించిన ఆటగాళ్ల జాబితాలో అతడు వేగంగా ముందుకు దూసుకెళ్తున్నాడు. ప్రస్తుతం జర్మనీ దిగ్గజం మిరోస్లావ్ క్లోజ్, అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సీ చెరో 16 గోల్స్‌తో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. మరోవైపు బ్రెజిల్ మాజీ స్టార్ రొనాల్డో ఖాతాలో 15 గోల్స్ ఉన్నాయి. సెనెగల్‌తో జరిగిన మ్యాచ్‌లో 66వ నిమిషంలో ఎంబాప్పే తొలి గోల్ సాధించాడు. అంతకుముందు సెనెగల్ గోల్‌కీపర్ మెండీ ఫ్రాన్స్ దాడులను అడ్డుకుంటూ జట్టుకు అండగా నిలిచాడు. అయితే ఎంబాప్పే తొలి గోల్ తర్వాత ప్రత్యేక శైలిలో సంబరాలు జరుపుకోవడం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో వేణువు వాయించిన ఎంబాప్పే, ఆఫ్రికా జట్టుపై గోల్ సాధిస్తే అదే తరహా సంబరాన్ని ప్రదర్శిస్తానని చెప్పినట్లు తెలుస్తోంది. తన మాటను నిలబెట్టుకుంటూ గోల్ అనంతరం వేణువు ఊదుతున్నట్లుగా సంకేతం ఇచ్చాడు. మ్యాచ్ అదనపు సమయంలో 96వ నిమిషంలో మరో గోల్ సాధించి తన ఖాతాలో గోల్స్ సంఖ్యను 14కు చేర్చుకున్నాడు. ఈ ప్రదర్శనతో ప్రపంచ ఫుట్‌బాల్‌లో మరో చారిత్రక మైలురాయికి చేరువయ్యాడు. దేశం కోసం చరిత్ర సృష్టించడమే తన లక్ష్యమని, ఫ్రాన్స్‌కు మరోసారి ప్రపంచకప్ అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎంబాప్పే వెల్లడించాడు. 2018 ప్రపంచకప్‌లో ఫ్రాన్స్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఎంబాప్పే, 2022లో జట్టును ఫైనల్‌కు చేర్చడంలోనూ ప్రధాన భూమిక పోషించాడు. ఇప్పుడు మరోసారి ఫ్రాన్స్ జట్టుకు నాయకత్వం వహిస్తూ ప్రపంచకప్ వేదికపై తన ప్రభావాన్ని చూపిస్తున్నాడు. ప్రస్తుతం అతడి అద్భుత ప్రదర్శన ఫుట్‌బాల్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

# భారత్-ఏకు 319 పరుగుల భారీ స్కోరు

**డంబుల్లా, జూన్ 17 :** శ్రీలంక వేదికగా జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో ఆఫ్ఘనిస్తాన్-ఏతో జరిగిన కీలక మ్యాచ్‌లో భారత్-ఏ జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 319 పరుగులు సాధించింది. సిరీస్‌లో నిలవాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత బ్యాటర్లు సమిష్టిగా రాణించి జట్టుకు బలమైన స్కోరు అందించారు. అయితే యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ మరోసారి భారీ ఇన్నింగ్స్ ఆడడంలో విఫలమయ్యాడు. దూకుడుగా ఆడిన అతడు 28 బంతుల్లో 38 పరుగులు చేసి క్యాచ్ అవుట్ అయ్యాడు. అతని ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లు ఉన్నాయి. ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్యా, సూర్యవంశీ తొలి వికెట్‌కు 75 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టుకు శుభారంభం అందించారు. అనంతరం ఆర్యా 58 పరుగులు చేసి అర్ధ సెంచరీ నమోదు చేశాడు. మధ్యవరుసలో కెప్టెన్ తిలక్ వర్మ, కుమార్ కుషాగ్ర అద్భుతంగా రాణించారు. ఇద్దరూ నాలుగో వికెట్‌కు 104 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టును బలమైన స్థితిలో నిలిపారు. తిలక్ వర్మ 59 పరుగులు చేయగా, కుమార్ కుషాగ్ర 58 పరుగులతో ఆకట్టుకున్నాడు. చివరి ఓవర్లలో విప్రాజ్ నిగమ్ వేగంగా ఆడి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతడు కేవలం 20 బంతుల్లో 30 పరుగులు సాధించి జట్టుకు



విలువైన పరుగులు జోడించాడు. అయితే చివరి ఓవర్‌లో భారత్-ఏ మూడు వికెట్లు కోల్పోవడంతో మరింత భారీ స్కోరు చేసే అవకాశాన్ని కోల్పోయింది. అయినప్పటికీ ఆర్యా, తిలక్ వర్మ, కుషాగ్రల అర్ధ సెంచరీలతో పాటు నిగమ్ మెరుపు ఇన్నింగ్స్ కారణంగా భారత్-ఏ 319 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆఫ్ఘనిస్తాన్-ఏ ముందుంచింది. ఇప్పుడు బౌలర్లు కూడా రాణిస్తే భారత్-ఏకు ఈ మ్యాచ్‌లో విజయం సాధించే అవకాశాలు మెరుగ్గా కనిపిస్తున్నాయి.

# ఫుట్‌బాల్ మ్యాచ్‌లో నార్వేకు ఘన ఆరంభం



**మసాచుసెట్స్, జూన్ 17 :** ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీ గ్రూప్-ఐ లీగ్ మ్యాచ్‌లో నార్వే జట్టు ఘన విజయంతో శుభారంభం చేసింది. జిల్లెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఇరాక్‌పై 4-1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. దాదాపు 28 ఏళ్ల తర్వాత ప్రపంచకప్ వేదికపై అడుగుపెట్టిన నార్వే జట్టుకు అభిమానులు భారీ మద్దతు తెలిపారు. స్టేడియం నిండా నార్వే అభిమానులు తమ సంప్రదాయ 'వైకింగ్ రో' ప్రదర్శనతో సందడి చేసి ఆటగాళ్లలో ఉత్సాహాన్ని నింపారు. మ్యాచ్ ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన నార్వేకు స్టార్ స్ట్రైకర్ ఎర్లింగ్ హాలాండ్ అండగా నిలిచాడు. తన ప్రపంచకప్ అరంగేట్ర మ్యాచ్‌లోనే హాలాండ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. 29వ నిమిషంలో తొలి గోల్ సాధించిన అతడు, 43వ నిమిషంలో మరో గోల్ నమోదు చేసి జట్టుకు కీలక ఆధిక్యాన్ని అందించాడు. ఇరాక్ జట్టు కూడా పోరాట పటిమను ప్రదర్శించింది. 39వ నిమిషంలో ఐమెన్ హుస్సేన్ శక్తివంతమైన హెడర్ ద్వారా గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేశాడు. దీంతో తొలి అర్ధభాగం ఉత్కంఠభరితంగా సాగింది. అయితే రెండో అర్ధభాగంలో నార్వే పూర్తి ఆధిపత్యం చెలాయించింది. 76వ నిమిషంలో లియో ఓస్టిగార్డ్ మరో గోల్ నమోదు చేయగా, మ్యాచ్ ముగింపు దశలో ఇరాక్ ఆటగాడు చేసిన స్వీయ గోల్‌తో నార్వే ఖాతాలో నాలుగో గోల్ చేరింది. దీంతో నార్వే 4-1 తేడాతో ఘన విజయం సాధించి గ్రూప్-ఐలో కీలక రెండు పాయింట్లు సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో హాలాండ్ అద్భుత ప్రదర్శనతో పాటు నార్వే అభిమానుల 'వైకింగ్ రో' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేలాది మంది అభిమానులు ఒకే తీరులో చేతులు పైకెత్తి చప్పట్లు కొడుతూ గర్జనలు చేయడంతో స్టేడియం మొత్తం మారుమోగిపోయింది. ప్రస్తుతం ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. 'వైకింగ్ రో' అనేది నార్వే, ఐస్‌లాండ్ వంటి ఉత్తర యూరప్ దేశాల ఫుట్‌బాల్ అభిమానుల ప్రత్యేక సంప్రదాయం. అభిమానులు ఏకకాలంలో చేతులు పైకెత్తి చప్పట్లు కొడుతూ గట్టిగా గర్జనలు చేయడం ద్వారా ఆటగాళ్లలో యుద్ధస్ఫూర్తిని నింపుతారు. ఈ విన్యాసం ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంటూ ఉంటుంది.

# వైభవ్‌తో ఘర్షణ.. లంక ఆటగాడిపై వేటు?

**దంబుల్లా, జూన్ 17:** శ్రీలంక-ఏ జట్టు ఆటగాడు విషెన్ హలంబగే, భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీల మధ్య మైదానంలో చోటుచేసుకున్న ఘర్షణ క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దంబుల్లా వేదికగా జరిగిన భారత్-ఏ, శ్రీలంక-ఏ త్రైసిరీస్ మ్యాచ్ అనంతరం జరిగిన ఈ ఘటనపై శ్రీలంక క్రికెట్ బోర్డు క్రమశిక్షణా చర్యలు చేపట్టినట్లు సమాచారం. మ్యాచ్ రిఫరీ ప్రదీప్ జయప్రకాశ్ సమర్పించిన నివేదిక ఆధారంగా విషెన్ హలంబగేపై రెండు మ్యాచ్‌ల నిషేధం విధించినట్లు జాతీయ క్రీడా మాధ్యమాలు వెల్లడించాయి. ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. ఐసీసీ ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ టోర్నమెంట్ల మాదిరిగా విచారణ ప్రక్రియ నిర్వహించకుండా, అంపైర్ల నివేదిక ఆధారంగా శ్రీలంక బోర్డు నేరుగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలో మధ్యవర్తిత్వం చేసేందుకు ప్రయత్నించిన సీనియర్ వికెట్‌కీపర్ నిరోషన్ డిక్వెల్లాకు కూడా జరిమానా విధించినట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే అతిగా అప్పీల్ చేసినందుకు వేరే ఉల్లంఘన కింద ఈ జరిమానా విధించినట్లు తెలుస్తోంది. ఘర్షణకు దారితీసిన అసలు కారణం మ్యాచ్ ముగిసిన తర్వాత జరిగిన మాటల యుద్ధమేనని సమాచారం. సూపర్ ఓవర్‌లో భారత్ ఓటమి పాలైన తర్వాత నిరాశతో మైదానం వీడుతున్న వైభవ్ సూర్యవంశీని లక్ష్యంగా చేసుకుని విషెన్ హలంబగే అవమానకర వ్యాఖ్యలు చేసినట్లు వీడియోలు సూచిస్తున్నాయి. "మ్యాచ్ ముగిసింది.. ఇక ఇంటికి వెళ్లిపో. ఇది ఐపీఎల్ కాదు" అంటూ హలంబగే చేసిన వ్యాఖ్యలతో వైభవ్ ఆగ్రహానికి గురై అతడిని నెట్టివేసినట్లు తెలుస్తోంది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇదిలా ఉండగా, ఈ ఘటనపై భారత క్రికెట్ నియంత్రణ మండలి కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందించారు. భారత ఆటగాళ్లు టోర్నమెంట్‌పై పూర్తి దృష్టి పెట్టాలని, ఇలాంటి వివాదాల వల్ల దారి తప్పకూడదని సూచించారు. వైభవ్ సూర్యవంశీపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోకుండా బీసీసీఐ అతనికి క్లీన్‌చిట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. యువ ఆటగాళ్ల మధ్య జరిగిన ఈ ఘర్షణపై క్రికెట్ అభిమానులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ప్రత్యర్థి ఆటగాడి ప్రవర్తనను తప్పుబడుతుండగా, మరోవైపు మైదానంలో సంయమనం పాటించాల్సిన అవసరాన్ని నిపుణులు గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఘటన త్రైసిరీస్ కంటే ఎక్కువగా చర్చనీయాంశంగా మారింది.





# గిల్ అరుదైన రికార్డు.. కోహ్లీ మార్క్‌కు చెక్

**లక్నో, జూన్ 17 :** భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వన్డే క్రికెట్‌లో మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. స్వదేశంలో అత్యంత వేగంగా 1,000 వన్డే పరుగులు పూర్తి చేసిన భారత బ్యాటర్‌గా నిలిచి విరాట్ కోహ్లీ పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో లక్నో వేదికగా జరుగుతున్న రెండో వన్డే మ్యాచ్‌లో ఈ మైలురాయిని అందుకున్నాడు. అద్భుతమైన ఫామ్‌లో కొనసాగుతున్న గిల్ ఈ మ్యాచ్‌లో మరోసారి బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడి అర్ధశతకం నమోదు చేశాడు. తన క్లాస్ బ్యాటింగ్‌తో భారత జట్టుకు శుభారంభం అందించడంతో పాటు కీలక రికార్డును సొంతం చేసుకున్నాడు. మరోవైపు భారత జట్టు సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ కూడా అరుదైన ఘనత సాధించాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో 14,000 పరుగుల మార్కును అందుకున్న ఆటగాడిగా రికార్డు పుస్తకాల్లో చోటు దక్కించుకున్నాడు. భారత క్రికెట్‌లో అత్యంత నిలకడైన బ్యాటర్లలో ఒకరిగా



కొనసాగుతున్న రోహిత్ మరో విశేషాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆఫ్ఘనిస్థాన్ జట్టు ముందుగా ఫీల్డింగ్ ఎంచుకుంది. రెండో వన్డే కోసం భారత జట్టులో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. యువ ఫాస్ట్ బౌలర్ ప్రిన్స్ యాదవ్ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేయగా, కుల్దీప్ యాదవ్, యశస్వి జైస్వాల్ తుది జట్టులో చోటు దక్కించుకున్నారు. భారత్ బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. 30 ఓవర్లు ముగిసే సమయానికి భారత్ 2 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసి భారీ స్కోరు దిశగా దూసుకెళ్లింది. మూడు వన్డేల సిరీస్‌లో ఇప్పటికే భారత్ ఆధిపత్యం చాటుతోంది. తొలి వన్డేలో 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన టీమిండియా 1-0 ఆధిక్యంలో ఉంది. రెండో మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగింది. శుభ్‌మన్ గిల్ రికార్డు, రోహిత్ శర్మ మైలురాయి ఈ మ్యాచ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# నటి మృతి కేసులో కొత్త మలుపు..

## వైరల్ అవుతున్న చాట్‌లు



సినీ, టెలివిజన్ రంగాల్లో నటిగా గుర్తింపు తెచ్చుకున్న సంచితా ఉగలే అనుమానాస్పద మృతి కేసులో కొత్త పరిణామాలు వెలుగులోకి వచ్చాయి. ఆమె మరణానికి ముందు జరిగినట్లు చెబుతున్న కొన్ని వ్యక్తిగత సందేశాలు బయటకు రావడంతో కేసు దర్యాప్తు మరింత ఆసక్తికరంగా మారింది. చిన్న వయసులోనే సినీ రంగంలో స్థిరపడాలని లక్ష్యంగా పెట్టుకున్న సంచితా, కొంతకాలంగా మానసిక ఒత్తిడి, ఆందోళన సమస్యలతో బాధపడుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆమె వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కూడా పొందుతున్నట్లు కుటుంబ వర్గాలు వెల్లడించాయి. అయితే ఇటీవల ఆమె తన నివాసంలో ప్రాణాలు తీసుకోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సంచితా మరణం అనంతరం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సినీ పరిశ్రమలో ఎదురైన ఒత్తిళ్లు, అవకాశాల కోసం జరిగిన పోరాటం ఆమె మానసిక స్థితిపై ప్రభావం చూపి ఉండవచ్చని సన్నిహితులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, తన కుమార్తె మరణంపై అనేక సందేహాలు ఉన్నాయని ఆమె తండ్రి పేర్కొన్నట్లు సమాచారం. కొందరి వేధింపులు, నిరంతర ఒత్తిడి ఆమెను తీవ్రంగా కలిచివేసి ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, సంచితా మరియు ఆమె మానసిక వైద్యుడి మధ్య జరిగినట్లు ప్రచారంలో ఉన్న సందేశాల చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. వాటి ప్రకారం ఆమె భవిష్యత్తుపై ఆందోళన, ఆత్మవిశ్వాస లోపం, వృత్తిపరమైన ఒత్తిడితో బాధపడుతున్నట్లు కనిపిస్తోందని వార్తలు వెలువడుతున్నాయి. షూటింగ్ సమయంలో సంభాషణలు గుర్తుంచుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మునుపటి మాదిరిగా పని చేయలేకపోతున్నానని ఆమె పేర్కొన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ సందేశాల ప్రామాణికతపై ఇప్పటివరకు అధికారిక ధృవీకరణ లేదు. దర్యాప్తు సంస్థలు అన్ని కోణాల్లో కేసును పరిశీలిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న సమాచారం నిజానిజాలపై అధికారిక వివరాలు వెలువడే వరకు వేచి చూడాల్సిన అవసరం ఉందని అధికారులు సూచిస్తున్నారు. సంచితా మృతి ఘటన సినీ రంగంలో మానసిక ఆరోగ్యం, వృత్తిపరమైన ఒత్తిళ్లపై మరోసారి చర్చకు దారితీసింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



## ఆల్ఫా ట్రైలర్ విడుదల

యష్ రాజ్ ఫిల్మ్స్ ప్రతిష్ఠాత్మక స్పై యూనివర్స్ నుంచి వస్తున్న మోస్ట్ అవేటెడ్ చిత్రం 'ఆల్ఫా' అధికారిక ట్రైలర్ విడుదలై సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఆలియా భట్, శర్వరీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌కు శివ్ రావైల్ దర్శకత్వం వహించారు. బాబీ డియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'ఆల్ఫా' చిత్రం వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో వస్తున్న మొట్టమొదటి మహిళా ప్రధాన స్పై యాక్షన్ థ్రిల్లర్ కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ట్రైలర్‌లో భారతదేశపు తదుపరి తరం సైనికులను తయారు చేసే రహస్య ప్రోగ్రామ్ 'ఆల్ఫా' చుట్టూ కథ తిరుగుతున్నట్లు చూపించారు. 'గొర్రెలా కాదు? తోడేలులా జీవించాలి' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటోంది. ఇక ట్రైలర్‌లో ఆలియా భట్ మునుపెన్నడూ చూడని యాక్షన్ అవతార్‌లో కనిపించారు. శర్వరీతో కలిసి భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు, గూఢచర్యం, హెవీ కాంబాట్ ట్రైనింగ్ సన్నివేశాలు హైలైట్‌గా నిలిచాయి. 'ది రైల్వే మెన్' ఫేమ్ శివ్ రావైల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. ఆదిత్య చోప్రా నిర్మాణంలో యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం 2026 జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




## పెద్ది నుంచి చికిరి చికిరి ఫుల్ సాంగ్ విడుదల

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'పెద్ది' నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్‌ను పంచుకున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'చికిరి చికిరి' అనే పాటకి సంబంధించిన ఫుల్ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో రామ్ చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్, జాన్వీ గ్లామర్, మాస్ కొరియోగ్రఫీ హైలైట్‌గా నిలిచాయి. చరణ్ రగ్డ్ లుక్‌లో, ఊర మాస్ స్టెప్పులతో ఇరగదీయగా, జాన్వీ కపూర్ ట్రెడిషనల్ అవుట్‌ఫిట్‌లో కుర్రకారు మతులు పోగొడుతోంది. ఇక ఈ చిత్రానికి ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందించాడు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా నిర్మించాయి.



## లాయర్ పాత్రలో కీర్తి సురేశ్

జులై 24న విడుదల కానున్న సత్తియవాన్ సావిత్రి

ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వంలో, కథానాయిక కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కోర్టు రూమ్ డ్రామా చిత్రం 'సత్తియవాన్ సావిత్రి' విడుదల తేదీ ఖరారైంది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని కీర్తి తన ఇన్‌స్టా పోస్ట్‌లో వెల్లడించారు. ఈ సందర్భంగా పంచుకున్న పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇందులో కీర్తి సురేశ్ న్యాయవాదిగా ప్రత్యర్థిని సవాల్ చేస్తున్నట్లు కన్పించింది. ఈ పోస్టర్‌పై అభిమానులు స్పందిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మరో పవర్‌ఫుల్ పాత్రలో కీర్తిని చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నామంటూ కామెంట్లు పెట్టారు. ఈ చిత్రం గురించి దర్శకుడు ప్రవీణ్ ఎస్ విజయ్ ఇటీవల మాట్లాడుతూ.. 'న్యాయానికీ, చట్టానికీ మధ్య తేడా ఉంటుంది. తన భర్త కేసులో భాగమైన సావిత్రి అనే న్యాయవాది కథే ఈ చిత్రం. ఆమె న్యాయం కోసం పోరాడుతుంటే, ఆమె సీనియర్‌కు మాత్రం చట్టమే ముఖ్యం. పరిస్థితుల కారణంగా ఆమె తన సీనియర్‌తోనే తలపడాల్సి వస్తుంది' అని తెలిపారు. 'హార్ట్ బీట్' ఫేమ్ చారుకేశ్ ఇందులో కీర్తి భర్తగా నటిస్తున్నారు. ఇక కీర్తి తదుపరి ఓ భారీ బ్జడెట్ రొమాంటిక్ థ్రిల్లర్ కోసం ప్రముఖ దర్శకుడితో చర్చలు జరుపుతున్నారని తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ భారీస్థాయిలో రూపొందనుందని, ఇప్పటివరకు చేయని జోనర్‌లో ఆమె కనిపించనున్నారని టాక్. అటు కీర్తి, రాజ్‌కుమార్ రావ్ జంటగా నటించిన 'రఫ్తార్' చిత్రం కూడా విడుదల కానుంది.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com